
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5 వరంగల్
గురువారం 21 మార్చి 2024

బుధవారం ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 31.0°C | కనిష్ఠం : 20.0°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ :	గురువారం	సా : 6.33 గం..
సహర్ :	శుక్రవారం	ఉ : 4.57 గం..



'అత్యవసరమే' అవకాశంగా..

(వరంగల్ - ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

వైద్య, ఆరోగ్యశాఖలో డిప్యూటేషన్ల అక్రమాలు జోరు గా సాగుతున్నాయి. ప్రభుత్వం అత్యవసరం పేరిట క ల్పించిన డిప్యూటేషన్ల అవకాశాన్ని కొంతమంది డీఎం హెచ్‌వోలు దుర్వినియోగం చేస్తున్నారనే ఆరోపణలు విని పిస్తున్నాయి. గత ఫిబ్రవరి 7వ తేదీన వైద్య, ఆరోగ్యశా ఖలో అన్ని రకాల డిప్యూటేషన్లను, వర్క్ ఆర్డర్లను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో ఇతర జిల్లాలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న వైద్య ఉద్యోగులు తమ పాత జిల్లాలోని వారి సొంత డిపార్ట్‌మెంట్‌లలోకి తిరిగి వెళ్లారు. దీంతో ఉమ్మడి జిల్లాలో సమారు 200 మందికి పైగా డిప్యూటేషన్లు రద్దయ్యాయి. అయితే ప్ర భుత్వం ఇచ్చిన ఆర్డర్‌లో ఉన్న చిన్న పాయింటే అక్రమ డిప్యూటేషన్లకు వరంగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. అత్యవసరమైతే కలెక్టర్ల అనుమతి తో జిల్లాస్థాయిలో డిప్యూటేషన్లు ఇచ్చే అధికారం డీఎం హెచ్‌వోలకు ప్రభుత్వం కల్పించింది. దీంతో ఎడాపెడాగా జిల్లా స్థాయిలో డిప్యూటేషన్లకు అధికారులు శ్రీకారం చుట్టుతున్నారు. ఇదే అదనుగా దళారులు పోస్టుకో రేటు పెట్టి పైరవీలు మొదలు పెట్టడం వైద్యశాఖలో కలకలం రేపుతోంది.

డిప్యూటేషన్లను రద్దు చేసిన ప్రభుత్వం

పైరవీలతో తమకు అనుకూల ప్రదేశాల్లో ఏళ్ల తరబ డి పనిచేస్తున్న ఉద్యోగులను తమ సొంత ప్రాంతానికి పంపిం చాలనే లక్ష్యంతో ఫిబ్రవరి 7వ తేదీన డిప్యూటేష న్లను రద్దు చేస్తూ వైద్య, ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తు ఉత్త ర్వులు జారీ చేశారు. దీంతో ఉమ్మడి వరం గల్ జిల్లాలో సుమారు 200మందికి పైగా ఉద్యోగులు, సి బ్బంది వివిధ ప్రాంతాల నుంచి తిరిగి సొంత శాఖలకు చేరుకున్నారు. ములుగు, భూపాలపల్లి, జనగామ, మహ బూబాబాద్ జిల్లాల నుంచి అధికసంఖ్యలో వైద్య ఉద్యో గులు వరంగల్, హనుమకొండ జిల్లాలకు డిప్యూటేషన్లపై వచ్చారు. సొంత జిల్లాలకు వెళ్లకుండా వరంగల్, హను మకొండ జిల్లాల్లో మకాం వేశారు. దీంతో వేతనాలు అక్కడ, ఉద్యోగం ఇక్కడ అనే చందంగా మారింది. అయితే ప్రభుత్వం డిప్యూటేషన్ల తోపాటు వర్క్ ఆర్డర్ విధానాన్ని కూడా రద్దు చేయటంతో అన్ని జిల్లాల్లో వైద్య కార్యాల యాలు, అస్పత్రులు ఉద్యోగులతో కళకళలాడాయి.

డిప్యూటేషన్లకు అడ్డదారిలో...

ప్రభుత్వం డిప్యూటేషన్లను రద్దు చేస్తూ ఇచ్చిన ఉత్త ర్వుల్లో ఒక చిన్న పాయింట్‌ అక్రమ డిప్యూటేషన్లకు అ డ్డదారిగా మారిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నా యి. కలెక్టర్ల అనుమతితో అత్యవసరమైతే జిల్లాస్థాయిలో డిప్యూ టేషన్లు ఇచ్చే అధికారాన్ని డీఎంహెచ్‌వోలకు అప్ప గించారు. దీంతో డిప్యూటేషన్ల దందా మళ్లీ మొదలైంది. ఒక్క హనుమకొండ జిల్లాలోనే 40మంది వైద్య ఉద్యో గులు, సిబ్బందిని జిల్లా స్థాయిలో అత్యవసరం పేరిట బది లీలు చేపట్టారు. పీహెచ్‌సీల్లో పనిచేసే మెడికల్ ఆఫీసర్లు, నర్సింగ్ అధికారులు, సీహెచ్‌వోలు, ఎంపీ హెచ్‌ఈవోలు, ఎంపీహెచ్‌ఎస్‌లు, ఎంపీహెచ్‌ఏలు, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఎల్‌డీ కంప్యూటర్, ఆఫీస్ సబార్డినేట్, రెండో ఏఎన్‌ఎంలు, థియేటర్ అసిస్టెంట్, పంపు మెకానిక్ వరకు డిప్యూటేషన్లపై బదిలీ చేశారు. పెద్దమొత్తంలో హనుమకొండ జిల్లాలో వైద్య సిబ్బందికి డిప్యూటేషన్ ఇవ్వటం వైద్యశాఖలో నూ తీవ్ర చర్చనీయాం శంగా మారింది.

- అన్నిటినీ రద్దు చేస్తూ గత నెల ప్రభుత్వం ఉత్తర్వులు
- తప్పనిసరైతే జిల్లాస్థాయిలో చేయొచ్చని సూచన
- ఇదే అదనుగా ఎడాపెడాగా డిప్యూటేషన్లు
- డీఎంహెచ్‌వో కార్యాలయాల్లోనే తిష్ట వేస్తున్న ఉద్యోగులు
- ఒక్కో పోస్టుకు ఒక్కో రేటుతో దళారుల పైరవీలు

అలాగే వరంగల్ జిల్లాలోనూ భారీగానే డి ప్యూటేషన్లు ఇచ్చేశారు. 28మందికి పైగా జిల్లా స్థాయిలో బదిలీలు చేపట్టారు. డీఎంహెచ్‌వో కా ర్యాలయంలోనే 8మంది వరకు డిప్యూటేషన్‌పై పనిచేస్తున్నారు. రాయపర్తి, నల్లబెల్లి, పర్వతగిరి మండలాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను డీఎం హెచ్‌వో కార్యాలయంలో పని చేయిస్తున్నారు. అయితే జిల్లాస్థాయిలో వేర్వేరు ప్రాంతాల్లోకి బ దిలీచేస్తే తప్పనిసరిగా జిల్లా కలెక్టర్ అనుమతి తీసుకోవాలని ఆదేశాలు ఉన్నప్పటికీ వైద్యశాఖ అధికారులు ఇవేవీ పట్టించుకోకుండానే నామ మాత్రంగా మౌఖికంగా తెలియజేసి డిప్యూ టేష

వైద్య, ఆరోగ్యశాఖలో మళ్లీ డిప్యూటేషన్ల అక్రమాలు

న్లు ఇస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాగే మహబూబాబాద్‌లో 36మంది, జనగా మలో 16మంది, భూపాలపల్లిలో 18 మంది వరకు డిప్యూటేషన్ల కోసం దరఖాస్తులు చేసు కున్నట్లు సమాచారం. ఇవి కలెక్టర్ల వద్ద పెండిం గ్‌లో ఉన్నట్లు సమాచారం. వీరికి కూడా రేపో మాపో గ్రీన్‌సిగ్నల్ ఇచ్చేందుకు పైరవీకారులు చర్చలు జరుపుతున్నారనే ప్రచారం ఉంది.

సొమ్ము చేసుకుంటున్న దళారులు

వైద్య, ఆరోగ్యశాఖలో అత్యవసరం పేరిట జిల్లా స్థాయిలో డిప్యూటేషన్ల దందాను దళారు లు సొమ్ము చేసుకుంటున్నారనే విమర్శలున్నా యి. పోస్టును బట్టి రేటు ఫిక్స్ చేసి వసూళ్ల చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మం డలాల నుంచి వరంగల్ కార్పొరేషన్ పరి ధిలోకి వచ్చేందుకు చాలామంది ఆసక్తి చూపు తున్నా రు. వారి ఆసక్తి దళారులకు కాసులుగా మారు తున్నాయనే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. గెజిటె డ్ పోస్టులకు రూ.3లక్షల వరకు, నాన్ గెజిటెడ్ పోస్టులకు ఏరియాలను బట్టి రూ.1లక్ష నుంచి రూ.2లక్షల వరకు దళారు వసూళు చేస్తున్నార నే ఆరోపణలు వినిపిస్తు న్నాయి. వీటికి తోడు పార్టీలను ఏర్పాటు చేసి పెద్ద సార్లను మెప్పిం చే పనిలో కూడా కొంత మంది దళారులు ఉన్న ట్లుగా ప్రచారం జరుగు తోంది. ప్రభుత్వం రద్దు చేసిన డిప్యూటేషన్ల దందా అత్యవసరం పేరిట మళ్లీ మొదలైందనే విమర్శలు వినబడుతున్నాయి.

డీఎంహెచ్‌వోలు డిప్యూటేషన్లపైనే..

ప్రభుత్వం వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులందరి డిప్యూటేషన్లు, వర్క్ ఆర్డర్ విదానాన్ని రద్దు చేస్తున్నట్లు ఫిబ్రవరి 7వ తేదీన ప్రకటించింది. అయితే ఉద్యోగులు, సిబ్బంది అదే రోజు డిప్యూటేషన్ జాబ్ వదిలి పాత పోస్టులో రిపోర్టు చేశారు. అయితే డీఎంహెచ్‌వోలు మాత్రం తమ సీట్లను వదలటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురు డీఎంహెచ్‌వోలు డిప్యూటేషన్‌పైనే విధులు నిర్వహిస్తున్నారు. హనుమకొండ డీఎంహెచ్‌వోగా పనిచేస్తున్న సాంబశివరావు పోస్టింగ్ మహబూబ్‌నగర్. డిప్యూటేషన్‌పై హనుమకొండలో పని చేస్తున్నారు. అలాగే వరంగల్ డీఎంహెచ్‌వో వెంకటరమణ పోస్టింగ్ కరీంనగర్.. డిప్యూటేషన్‌పై వరంగల్‌లో డ్యూటీ చేస్తున్నారు. అలాగే ములుగు డీఎంహెచ్‌వో అప్పయ్య 2019 నుంచి ములుగును వదలడం లేదు. హనుమకొండ డీఎంహెచ్‌వోగా డ్యూటీ చేయాల్సిన అప్పయ్య.. డిప్యూటేషన్‌పై ములుగులో పని చేస్తున్నారు. వరంగల్ ఎంజీఎం ఆర్‌ఎంవోగా పనిచేస్తున్న హరీష్‌రాజ్ ఇటీవలే డిప్యూటేషన్‌పై జనగామ డీఎంహెచ్‌వో విధుల్లో చేరారు. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారులే డిప్యూటేషన్‌పై పని చేస్తున్నప్పటికీ ప్రభుత్వం దృష్టి సారించటం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఓటు హక్కు వినియోగించుకోవాలి

- స్వీప్ కార్యక్రమంలో కలెక్టర్ ప్రావీణ్య



ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్ ప్రావీణ్య, అధికారులు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 20: ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. వరం గల్ ఉర్సుగుట్ట సమీపంలోని ఫాదర్ కొలంబో మెడికల్ కళాశాలలో స్వీప్(సిస్ట మాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్, ఎలక్టోరల్ పార్టిసిపేషన్) ఓటరు చైతన్యంపై బుధవా రం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ప్రజాస్వామ్యంలో ఓటు అనేది ఆయుధం లాంటిదని, ఓటుహక్కు పొందిన వారు ఓటు వేయాలన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం, ఎన్నికల సందర్భంగా అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఎన్నికలు పారదర్శకంగా జరగడానికి ప్రతి ఒక్కరి సహకారం అవసరమని సూచించారు. అనంతరం కళాశా ల విద్యార్థులచే మానవహారం, ఎన్నికల ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, కళాశాల డైరెక్టర్ తరుణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంధ్యా రాణి, మెడికల్ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

- పోలీసు కవాతులో మామునూరు ఏసీపీ తిరుపతి



తిమ్మాపురంలో ప్రజలతో మాట్లాడుతున్న ఏసీపీ తిరుపతి

సంగెం, మార్చి 20 : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికలకు అందరు సహ కరించాలని మామునూరు ఏసీపీ తిరుపతి కోరారు. 43వ డివిజన్ మామునూరు పోలీసుస్టేషన్ పరిధిలోని అల్లీపురం, తిమ్మాపురం హవేలి గ్రామాల్లో బుధవారం కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా తిమ్మాపురంలో ఏసీపీ తిరుపతి ఎన్నికల ను ఉద్దేశించి మాట్లాడారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమకు ఇష్టమొచ్చిన అభ్యర్థికి అమూల్యమైన ఓటు వేసి గెలిపించుకోవాలన్నారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా చూడాలని అన్నారు. ఎన్నికల నియమా వళికి విరుద్ధంగా ప్రవర్తిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో ఎన్నిక లు నిర్వహించడానికి వచ్చే అధికారులకు అందరు సహకరించాలని ఏసీపీ సూచిం చారు. ఈ కార్యక్రమంలో మామునూరు సీఐ రవికుమార్, ఎస్ఐ శ్రీకాంత్, పోలీ సులు, ప్రజలు పాల్గొన్నారు.



గొర్రెకుంట క్రాస్ వద్ద వాహనాన్ని తనిఖీ చేస్తున్న ఏసీపీ

ప్రతీ వాహనాన్ని పరిశీలిస్తాం

- వరంగల్ ఏసీపీ నందిరాం నాయక్

మట్టెవాడ, మార్చి 20 : సాధారణ ఎన్నికల నేపథ్యంలో వరంగల్ తూర్పు నియోజకవర్గం పరిధిలో మూడు వాహన తనిఖీ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వరంగల్ ఏసీపీ నందిరాంనాయక్ తెలిపారు. బుధవారం సాయంత్రం వరం గల్ నాయుడు పెట్రోల్ పంపు జంక్షన్, వరంగల్ నర్సంపేట రోడ్డు గొర్రెకుంట క్రాస్‌వద్ద ఏర్పాటు చేసిన కేంద్రాల్లో పోలీ సులు వాహన తనిఖీలు చేపట్టారు. వరంగల్ పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో నాయుడు పెంట్రల్ పంపు జంక్షన్, ఆటో నగర్, గొర్రెకుంట క్రాస్ వద్ద వాహన తనిఖీలను ఏర్పాటు చేసినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. ఎన్నికల వాహన తనిఖీ కేంద్రాలు 24 గంట లు పనిచేస్తాయని తెలిపారు. ఎన్నికల ప్రవర్తన నియమా వళికి విరుద్ధంగా నగదు, మద్యం రవాణాను కట్టడి చేయడా నికి నిరంతరం తనిఖీలు చేస్తామని తెలిపారు. తనిఖీల్లో మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య, ఎస్సై గోవర్దన్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకే భవన నిర్మాణ అనుమతులు

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- క్షేత్రస్థాయిలో పర్యటన.. భవన నిర్మాణాలు, తాగు నీటి సరఫరాపై పరిశీలన

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: ప్రభుత్వ నిబం ధనల మేరకే బల్దియా పరిధిలో భవన నిర్మాణ పనుల కు అనుమతులు ఇస్తున్నామని గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అన్నా రు. హనుమకొండ నక్కలగుట్ట, వరంగల్ శాంతినగర్, బాలసముద్రంతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించా రు. ఇంకా భవన నిర్మాణ అనుమతులు, నీటి సరఫరా, పన్నుల వసూళ్లపై బుధవారం క్షేత్రస్థాయి పర్యటన చేశారు. అధికారులకు పలు సూచనలు చేశారు. బాల సముద్రంలో నిర్మిస్తున్న కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణా నికి ఇచ్చిన అనుమతి పత్రాలను పరిశీలించారు. నక్కలగుట్ట సమీపంలోని చెన్నై షాపింగ్ మాల్ సమీ పంలో నిర్మించిన కాంప్లెక్స్‌కు ఎన్‌ఓసీని పరిశీలించారు. బాలసముద్రం ప్రాంతంలో పన్నుల వసూలు విధానం, ఆన్‌లైన్ పద్ధతిని పరిశీలించారు. వరంగల్ శాంతినగర్ లో నివసిస్తున్న ప్రజలతో మాట్లాడి వారు ఎదుర్కొం టున్న సమస్యలను స్వయంగా అడిగి తెలుసు కున్నా రు. ఈ ప్రాంతంలో డ్రైనేజీ శుభ్రం చేయడం లేదని ప్రజలు చెప్పడంతో అక్కడ ఉన్న అధికారులను పిలిచి మందలించారు. సిబ్బందిని వెంటనే పిలిపించి డ్రైనేజీ శుభ్రం చేయించారు. కమిషనర్ వెంట సీఎంహెచ్‌వో రాజేశ్, సిటీ ప్లానర్ వెంకన్న, డీసీ రవీందర్, ఈఈ రాజయ్య, ఈఈ సంతోష్, ఆర్‌వో సుదర్శన్, టీపీవోలు సుష్మ, బషీర్, మేనక, విజయలక్ష్మిలతో పాటు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు గోల్కొండ శ్రీనివాస్, పోలెపాక అనీల్ కుమార్ ఉన్నారు.



నక్కలగుట్టలో బిల్డింగ్ పర్మిషన్ మ్యాప్‌ను పరిశీలిస్తున్న కమిషనర్

పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వద్దు

కార్పొరేషన్ పరిధిలో వివిధ విభాగాల్లో వసూలు చేసే పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించవద్దని కమి షనర్ అశ్విని తానాజీ వాకడే గ్రేటర్ రెవెన్యూ అధికా రులకు సూచించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ అధికారులతో బుధవారం సమీక్ష సమావేశం నిర్వ హించారు. గ్రేటర్ పరిధిలో పనిచేస్తున్న ఆర్‌ఐల తీరుపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇద్దరు ఆర్‌ఐలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. 2023-2024 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.97.66 కోట్లకు 60 శాతం వసూలు చేయడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు రూ.63.96 కోట్ల పన్నుల వసూలు జరిగిందన్నారు. పన్నుల వసూలుకు ఇంకా పది రోజుల సమయం మాత్రమే ఉందని, ఆర్‌ఐలు అంకితభావంతో పనిచేసి 95 శాతం పన్నులు వసూలు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతీ బిల్ కలెక్టర్ వంద మంది బకాయిదారుల నుంచి డబ్బులు వసూలు చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కల్పించిన వడ్డీపై 90 శాతం రాయితీపై ప్రజలకు అవగాహన కల్పించా లని కమిషనర్ అశ్విని తానాజీ వాకడే చెప్పారు. ఉదయం 11 గంటల నుంచి కమర్షి యల్ వసూళ్లు, 3 గంటల నుంచి బడా బకాయిదారు లపై దృష్టి సారించి పన్నులు వసూలు చేయా లని అధికారులకు సూచించారు. రెవెన్యూ అధికారులు, ఇన్‌స్పెక్టర్లు ప్రతీ రోజు పన్నుల బకాయి వివరాలను తనకు తెలియజేయాలని సూచించారు. ఈ సమావేశం లో అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్, డిప్యూటీ కమిషనర్లు రవీందర్, కృష్ణారెడ్డిలతో పాటు ఆర్‌వోలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

గవర్నర్‌ను కలిసిన మంత్రి కొండా సురేఖ



గవర్నర్ రాధాకృష్ణన్‌కు మొక్క అందజేస్తున్న మంత్రి కొండా సురేఖ

వరంగల్ కల్చరల్, మార్చి 20: నూతన గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ ప్రమాణస్వీకారోత్సవ కార్యక్రమానికి బుధవారం రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. గవర్నర్ రాధాకృష్ణన్ బాధ్యతలు చేపట్టిన అనంతరం మంత్రి కొండా సురేఖ మర్యాద పూర్వకంగా కలిసి మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ యజ్ఞానికి సంపూర్ణ సహకారం అందించాలని గవర్నర్‌ను మంత్రి సురేఖ కోరారు.

'ఆసరా' రాదాయే!

- రెండేళ్లుగా అమలుకు నోచుకోని వైనం
- కార్పొరేషన్‌లో మూలనపడ్డ అప్లికేషన్లు
- 2022 నుంచి ఎదురుచూస్తున్న దరఖాస్తుదారులు

గ్రేటర్ మునిసిపల్ పరిధిలో కొత్త పింఛన్లకు కలగని మోక్షం

నెలవారీ పింఛన్ వస్తేనే కొంద రికి పూట గడుస్తుంది. ఇంకొంద రికి మందులు, చిల్లర సామాన్లు తెచ్చుకోవడానికి ఆసరాగా ఉంటుంది. అలాంటి పేదలకు అండగా ఉండేందుకు ప్రభుత్వం ఇచ్చే ఆసరా పింఛన్లు అందని వారు ఎందరో ఉన్నారు. కొత్త పింఛన్లు రాక.. పోషించే వారు దూరమై కొందరు దుర్భర జీవనం సాగిస్తు న్నారు. వీరే కాక వితంతువులు, ఒంటరి మహిళలకు చాలారోజు లుగా కొత్త పింఛన్లు మంజూరు కాకపోవడంతో తీవ్ర మనోవేదనకు గురవుతు న్నారు. వరంగల్ మహానగర పాలక సంస్థ పరిధిలో సుమారు పదివేల మందికి పైగా రెండేళ్లుగా కొత్త పింఛన్ల కోసం ఎదురుచూ స్తున్నారు.



వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: గ్రేటర్ వరంగల్ మునిసి పల్ పరిధిలో కొత్త పింఛన్ల కోసం లబ్ధిదారులు రెండేళ్లుగా ఎదు రుచూస్తున్నారు. నూతనంగా 10,643మంది అర్హులైన వారు దర ఖాస్తులు చేసుకున్నా వారికి ప్రభు త్వాలు మొండిచేయి చూపిస్తు న్నాయి. 2022 మార్చి వరకు అర్హులైన వారికి పింఛన్లు మంజూరు చేయబడ్డాయి. గ్రేటర్ పరిధిలో 79,480 మంది పింఛన్‌దారులు నెలవారి పింఛన్లు తీసు కుంటున్నారు. వీరికి ప్రతీ నెల రూ.16కోట్ల వరకు డబ్బులు అందుతు న్నాయి. అయితే ఆ తర్వాత దరఖాస్తు చేసుకున్న వారికి కొత్త పింఛన్లు మంజూరు కాక పోవడం విచారకరం.

ఎదురుచూపులు

గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో 66 డివిజన్లలో చాలా మంది లబ్ధిదారులు కొత్త పింఛన్ ఎప్పుడు వస్తుందా? అని వేచి చూస్తు న్నారు. ఏళ్ల తరబడి పింఛన్ రాకపోవడంతో చాలా మంది నీరుగారిపోతున్నారు. ఇంట్లో ఇద్దరిలో ఒక రికి వృద్ధాప్య పింఛన్ వస్తుండగా ఇద్దరిలో ఒక్కరు మరణిస్తే కూడా మరొకరికి కూడా పింఛన్ మంజూరు కావడం లేదు. రెండేళ్లుగా ప్రభుత్వాలు పింఛన్‌దారులపై మొండి వైఖరి అవలంబిస్తోం దనే విమర్శలు వస్తున్నాయి. ప్రస్తుతం నెలవా రిగా తీసుకుంటున్న పింఛన్‌దారుల్లో కొందరు అడ్డ దారిలో నకిలీపత్రాలు సమర్పించి పింఛన్ తీసు కుంటున్నారని, అసలు అర్హులైన వారికి కొత్త పింఛన్ ఎందుకు మంజూరు చేయడం లేదని మండిపడుతున్నారు.

నిలిచిన కొత్త పింఛన్ల మంజూరు ప్రక్రియ

గతంలో కార్పొరేషన్ పరిధిలో అర్హులైన దివ్యాం గులు, వితంతువులు, వృద్ధులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలకు ప్రభుత్వం నుంచి ప్రతీ నెల రూ.2వేలు వస్తుండగా వికలాంగులకు రూ.3వేలు వస్తుండేవి. ఆరు మాసాల నుంచి వికలాంగులకు నెలకు రూ.4వేలు వస్తున్నారు. గత ప్రభుత్వంలో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు కొత్త పింఛన్‌లకు ఇప్పటికీ మోక్షం లేదు. అన్ని అర్హతలు ఉండి కూడా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకున్న చాలామంది బాధితులు స్థానిక కార్యాలయాలు, మీసేవా కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ చెప్పులరిగేలా తిరుగుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొందరు కింది స్థాయి లీడర్లు, ప్రజాప్రతినిధులు బ్రోకర్లుగా మారి కొత్త పింఛన్ ఇప్పిస్తామని అమాయకుల నుంచి అందిన కాడికి దండుకుంటు న్నారు. ఒక్కో వ్యక్తి నుంచి రూ.5 నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నట్టు సమాచారం. అయినా పింఛన్ రావడం లేదు. కొత్త పింఛ న్‌ల కోసం బడ్జెట్ మంజూరు కాలేదని, అందుకే ఆలస్యమవుతోందని చెప్పి సంబంధిత అధికారులు చేతులు దులుపుకుంటున్నారు.

మూలనపడ్డ దరఖాస్తులు

గ్రామీణ ప్రాంతాలతోపాటు నగరంలో అర్హులైన వారు కొత్త పింఛన్‌ల మంజూరు కోసం సంబంధిత మీ సేవా కేంద్రాల్లో దర ఖాస్తు చేసుకున్నారు. కొందరు మాత్రం బ్రోకర్లను ఆశ్రయించి పింఛన్ వస్తుందనే ఆశతో పెద్ద మొత్తంలో డబ్బులు ఇచ్చి దర ఖాస్తు చేసుకున్నారు. వీరు ఆధార్ కార్డు, తెల్ల రేషన్ కార్డు, మరణ ధ్రువీకరణ పత్రం, ఓటర్ గుర్తింపు కార్డులు తీసుకుని మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు 10, 643 మంది కొత్త పింఛన్‌కు అర్హత కలిగి ఉన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఆమోదించి మున్సిపల్ కార్యాలయానికి పంపిస్తాడు. కానీ కొత్త పింఛన్ ఫైళ్ల అమలుకు నోచుకోకుండా కార్యాలయంలోనే మూలుగుతున్నాయి. కార్యాల యంలో కుప్పలు తెప్పలుగా పేరుకుపోతున్నాయి. కొత్త పింఛన్ దారుల జాబితా హైదరాబాద్‌కు పంపిస్తున్నా వారు స్పందిం చడం లేదని నగర పాలక సంస్థ సంబంధిత విభాగం సిబ్బంది తెలిపారు. తమ వద్ద ఏమి లేదని, పింఛన్ మంజూరు చేస్తే డబ్బులు ఇస్తామని చెబుతున్నారు. సకాలంలో కొత్తపింఛన్లు ఇచ్చి తమను ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మృతదేహం లభ్యం

కాజీపేట, మార్చి 20: కాజీపేట రైల్వే స్టేషన్ సమీపంలో ఓ గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. కాజీపేట దర్గా రైల్వే ట్రాక్ సమీపంలో బుధవారం ఓ గుర్తు తెలియని మహిళ మృతి చెంది ఉంది. యాచకురాలు అనారోగ్యంతో మృతి చెందినట్లు తెలుస్తోంది. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ఎంజీఎంలో భద్రపరిచామని, ఆచూకీ తెలిసిన వారు కాజీపేట రైల్వే పోలీస్ స్టేషన్ ఫోన్ నంబర్ 98661 67291 నంబర్‌కు సంప్రదించాలని రైల్వే పోలీసులు తెలిపారు.

జాతీయ సమైక్యతా శిబిరానికి కేయూ జట్టు ఎంపిక

కేయూ క్యాంపస్, మార్చి 20: ఈనెల 22 నుంచి 28 వరకు కర్ణాటక రాష్ట్రంలోని జనపదలోక రాంనగర్‌లో జరిగే జాతీయ సమైక్యతా శిబిరానికి కాకతీయ యూనివర్సిటీ జట్టును ఎంపిక చేసినట్లు కేయూ జాతీయ సేవా పథకం ప్రోగ్రామ్ సమన్వయ అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ బుధవారం తెలిపారు. ఎంపికైన వారిలో టి.మనోజ (టీటీడబ్ల్యూఆర్‌డీసీ, మహబూబాబాద్), బి.హిందుప్రియా (ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల, ఖమ్మం), రోషిణి (కిట్స్ కళాశాల, హసన్‌పర్తి), పి.మనస్విత, (యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, సుబేదారి), జె.హర్షిత (యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల, కేయూ), సీహెచ్.శివశంకర్ (ఎల్‌బీ కళాశాల, వరంగల్), జి.రాజు (టీటీడబ్ల్యూఆర్‌డీసీ బాయ్స్, మణుగూరు.) బి. సూర్యకాంత్ (ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, ఆదిలాబాద్), జె.మహేశ్(వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, హనుమకొండ), జి.దిలీప్‌కుమార్(కేయూ ఇంజనీరింగ్ కళాశాల) ఉన్నారు. వీరికి హనుమకొండ ప్రభుత్వ వృత్తి విద్యా జూనియర్ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రేణుకుంట్ల ప్రవీణ్‌కుమార్ కాంటింజెంట్ లీడర్‌గా వ్యవహరిస్తారు. ఎంపికైన జట్టు సభ్యులను కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఇతర అధికారులు అభినందించారు.



బాధితులతో మాట్లాడుతున్న ఏసీపీ

ఐదు తులాల గొలుసు అపహరణ

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని విజయలక్ష్మీకాలనీలో మహిళ మెడలోని గొలుసును గుర్తుతెలియని యువకుడు లాక్కెళ్లాడు. కాలనీలో బందెల రమాదేవి అనే మహిళ కిరాణ షాపు నిర్వహిస్తోంది. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బైక్ మీద వచ్చి ఆలుగడ్డలు కావాలని బేరం చేస్తూనే ఒక్కసారిగా రమాదేవి మెడలోని ఐదు తులాల బంగారు గొలుసును లాక్కెళ్లాడు. పట్టుకునే ప్రయత్నం చేసినప్పటికీ హెల్మెట్‌తో ఉన్న యువకుడు బైక్ మీద పారిపోయాడు. సమాచారం అందుకున్న కేయూ సీఐ సంజీవ్, హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకుని బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు కేయూ సీఐ సంజీవ్ తెలిపారు.

కమిషనరేట్‌కు ఐపీఎస్ అధికారి

వరంగల్ క్రైం, మార్చి20: గ్రేహౌండ్స్ విభాగంలో శిక్షణ పొందుతున్న 2020 బ్యాచ్ ఐపీఎస్ అంకిత్‌కుమార్‌ను వరంగల్ కమిషనరేట్‌కు అటాచ్ చేస్తూ బుధవారం డీజీపీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు అంకిత్ కుమార్ వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్‌ఝాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంకిత్‌కుమార్‌ను సీపీ అభినందించారు.



సీపీని కలిసిన అంకిత్‌కుమార్

15 ఏళ్లుగా..

ఐసెట్‌ను పకడ్బందీగా నిర్వహిస్తున్న కాకతీయ విశ్వవిద్యాలయం
ఉమ్మడి రాష్ట్రం నుంచి ప్రత్యేక రాష్ట్రం దాకా దక్కిన గౌరవం

కేయూ క్యాంపస్, మార్చి 20: రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఐసెట్-24 నిర్వహణ 15వ సారి కాకతీయ యూనివర్సిటీకే దక్కింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మొదలుకుని తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత వరుసగా ఈ ఏడాది 15వ దఫా ఐసెట్ నిర్వహణ కేయూకే దక్కడం గర్వకారణం. రాష్ట్ర ఉన్నత విద్య మండలి యేటా ప్రవేశ పరీక్షలను ఒక్కో వర్సిటీకి కేటాయిస్తుంటుంది. అయితే ఐసెట్ నిర్వహణను మాత్రం ఉమ్మడి ఏపీ నుంచి వరుసగా కాకతీయ యూనివర్సిటీకే అప్పగిస్తోంది. ఉమ్మడి రాష్ట్రంలో కేయూ వరుసగా 6దఫాలుగా ఐసెట్ పరీక్షలను సమర్థవంతంగా నిర్వహించింది. 2014 నుంచి ఇప్పటి వరకు కేయూనే వరుసగా పకడ్బందీగా నిర్వహిస్తోంది. వర్సిటీలో మొదటగా ప్రొఫెసర్ ఓంప్రకాశ్, శర్మ, ప్రొఫెసర్ చింతకింది రాజేశం, ప్రొఫెసర్ రాజిరెడ్డి, ప్రొఫెసర్ వరలక్ష్మిలు కన్వీనర్‌గా సమర్థవంతంగా పనిచేశారు. అదే క్రమంలో ప్రస్తుతం కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సీనియర్ ప్రొఫసర్ శ్రీరామోజు నరసింహచారిని కన్వీనర్‌గా నియమించారు.

భారీగా పోటీ..

యేటా ఐసెట్ పరీక్షలు రాసే అభ్యర్థుల సంఖ్య పెరుగుతోంది. మేనేజ్‌మెంట్ రంగంలో దేశ, విదేశాల్లో ఉద్యోగ అవకాశాల వస్తుండటంతో బీటెక్ చేసిన అభ్యర్థులు సైతం ఎంబీఏ వైపు వస్తున్నారు. సగటున ఏడాదికి 70వేల మందికి పైనే అభ్యర్థులు పరీక్షలు రాస్తున్నారు. మార్కెటింగ్, ఫైనాన్స్ విభాగాల్లోనూ ఎంబీఏ అభ్యర్థులకు మంచి ఉద్యోగ అవకాశాలున్నాయి. స్కిల్ ఉన్న అభ్యర్థులను కార్పొరేట్ సంస్థలు భారీ ప్యాకేజీలతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పిస్తున్నాయి.

ఏదైనా డిగ్రీ

గుర్తింపుపొందిన వర్సిటీ నుంచి బీఏ, బీకాం, బీఎస్సీ, ఇంజనీరింగ్‌తోపాటు ఏదైనా డిగ్రీ కోర్సు పాసైన అభ్యర్థులందరూ ఐసెట్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ప్రస్తుతం ఫైనలీయర్ చదవుతున్న అభ్యర్థులు సైతం ఐసెట్ పరీక్షలకు హాజరుకావచ్చు. ఐసెట్ పరీక్ష 200 మార్కులకు ఉంటుంటి. 75 మార్కుల చొప్పున ఎనలైటికల్ ఎబిలిటీ, మ్యాథ్స్ ఎబిలిటీ సిలబస్‌తోపాటు మరో 50 మార్కులకు జనరల్ ఇంగ్లీష్‌లో సిలబస్ రూపొందించారు. అత్యధిక స్కోరు సాధించిన అభ్యర్థులకు ఉస్మానియా, కేయూ, పాలమూరు. శాతవాహన, తెలంగాణ, మహాత్మాగాంధీతోపాటు ఇతర వర్సిటీల్లోనూ సీట్లు పొందే అవకాశం ఉంది.



ఐసెట్ నోటిఫికేషన్ విడుదల చేస్తున్న దృశ్యం (ఫైల్)

షెడ్యూల్ విడుదల

రాష్ట్ర వ్యాప్తంగా ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో 2023-24 ఏడాదికి ప్రవేశాల మార్చి 5న టీఎస్ఐసెట్-24 నోటిఫికేషన్ విడుదల అయింది. మార్చి 7 నుంచి ఏప్రిల్ 30 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరిస్తారు. మే 17 నుంచి 27 వరకు రూ. 250, రూ.500 అపరాధ రుసుంతో దరఖాస్తులను స్వీకరిస్తారు. జూన్ 4, 5వ తేదీల్లో కంప్యూటర్ బెస్డ్ పరీక్ష నిర్వహిస్తామని రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు ప్రకటించారు.

పకడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తాం..

కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్, ఐసెట్ చైర్మన్



వరుసగా కేయూకు 15వ దఫా ఐసెట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉంది. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పకడ్బందీ పరీక్షలను నిర్వహిస్తాం. విద్యార్థులకు ఎల్లప్పుడూ సందేహాలను తీర్చేందుకు నిరంతరం అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. తెలంగాణతో పాటు ఏపీలోనూ ఐసెట్ పరీక్షల కేంద్రాలను ఏర్పాటు చేస్తాం.

నేడు కేయూకు మాజీ డీజీపీ ఆదిత్య ఆర్య రాక

కేయూ క్యాంపస్, మార్చి 20: కేయూ సెనెట్‌హాల్‌లో గురువారం ఉదయం 11 గంటలకు హైదరాబాద్ రామచంద్ర మిషన్ ఇన్‌స్టిట్యూట్ నేతృత్వంలో జరిగే ధ్యానం, రిలాక్సేషన్, స్వచ్ఛత, ఇతర విద్యార్థి ఉద్యోగార్థులకు ఉపయోగపడే అంశాలపై అవగాహన కల్పించేందుకు మాజీ డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) డాక్టర్ ఆదిత్య ఆర్య, యూఎస్ఏ నుంచి డాక్టర్ అరిహంత మాధవ మోహన్ హాజరుకానున్నట్లు కేయూ రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి కేయూ వీసీ తాటికొండ రమేశ్ అధ్యక్షత వహిస్తారని వెల్లడించారు. వర్సిటీలోని బోధన, బోధనేతర సిబ్బందితోపాటు పరిశోధకులు, విద్యార్థులందరూ రావాలని కోరారు.

కుష్టువ్యాధి నిర్మూలనకు పాటుపడాలి

వరంగల్ మెడికల్, మార్చి 20: కుష్టువ్యాధి నివారణలో భాగంగా ఇంటింటికీ తిరుగుతూ అవగాహన కల్పిస్తున్నట్లు రాష్ట్ర లెప్రసీ ఎల్‌సీడీసీ కార్యక్రమల పరిశీలకుడు డాక్టర్ మైకేల్ తెలిపారు. బుధవారం హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. కుష్టువ్యాధి నివారణకు ఆశ కార్యకర్తల నుంచి అధికారుల వరకు అందరూ పాటుపడాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా లెప్రసీ నిర్మూలన అధికారి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ మదన్ మోహన్‌రావు, పాల్గొన్నారు.

ప్రపంచ కవితా దినోత్సవం

హనుమకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకొని కవితా ఓ కవితా అన్న శీర్షికన ఆకాశవాణి వరంగల్ కేంద్రం గురువారం కవి సమ్మేళనం ప్రసారం చేయనున్నదని ఆకాశవాణి వరంగల్ కార్యక్రమం అధికారి ఇల్లెందుల రవికుమార్ తెలిపారు. అకాశవాణి వరంగల్ కేంద్ర ప్రాంగణంలో నిర్వహించే ఈ కవి సమ్మేళనంలో వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, డాక్టర్ జరీనాబేగం, చేవూరి శ్రీ రామారావు, డాక్టర్ మంతెన శంకర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, రమేశ్వర్ రాజు, బిల్ల మహేందర్ వనపర్తి పద్మావతి, హాజీ నురానీ కవితలను ముందుగానే రికార్డు చేశామని ఆయన తెలిపారు. ఈ కవిసమ్మేళనంలో గేయాలు, పద్యాలు, వచన కవితలు, మినీ కవితలు, మణిపూసలు ఇలా అన్ని ప్రక్రియలకు ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశం

వరంగల్ కార్పొరేషన్, మార్చి 20: తెలంగాణ రాష్ట్రం భవన నిర్మాణ సంక్షేమ మండలి ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు, నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎన్‌ఏసీ ఇన్‌స్ట్రక్టర్ గోపాల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 90 రోజుల శిక్షణలో ఎలక్ట్రీషియన్, హౌస్‌వైరింగ్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు వెల్లడించారు. 10వ పాస్ అయి 18 నుంచి 30 యేళ్లలోపు వారై ఉండాలని సూచించారు. శిక్షణా కాలంలో ఉచిత యూనిఫామ్, ఉచిత మధ్యాహ్నం భోజనం అందిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసిన తర్వాత న్యాక్ సర్టిఫికెట్ అందించి ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగ అవకాశం కల్పిస్తామన్నారు. వివరాలకు 7989247723, 9949684763 సెల్ నెంబర్‌లలో సంప్రదించాలని గోపాల్ సూచించారు.

కెనాల్‌లో పడిన వ్యక్తి
కాపాడిన ఇద్దరు యువకులు

వరంగల్ క్రైం, మార్చి20: కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చింతగట్టు క్యాంపు వద్ద కుమార్‌పల్లికి చెందిన యువకుడు బుధవారం మధ్యాహ్నం కెనాల్‌లో పడిపోయాడు. అటుగా వెళుతున్న లక్ష్మణ్, సాయి అనే ఇద్దరు యువకులు కెనాల్‌లో దూకి యువకుడిని కాపాడారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు యువకుడిని తల్లిదండ్రులకు అప్పగించారు. యువకుడిని కాపాడిన లక్ష్మణ్, సాయిలను ఎస్ఐ రాజ్‌కుమార్ అభినందించారు.



యువకుడిని కాపాడుతున్న స్థానికులు

పకడ్బందీగా పోలీసుల నిఘా, తనిఖీలు

వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్ పోస్టులు ● లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ఏర్పాటు

వరంగల్ క్రైం, మార్చి20: మే మాసంలో జరిగే లోక్‌సభ ఎన్నికలకు పోలీసు భద్రతను పటిష్ఠం చేశారు. వరంగల్ కమిషనరేట్ పరిధిలో 24 చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. ఎన్నికల కమిషన్ నిబంధనలు విస్మరించి డబ్బు, నగలు, మద్యం సరఫరాను చెక్ పోస్టులతో నియంత్రించనున్నారు. నిబంధనలను విస్మరించి ఆధారాలు లేకుండా రూ.50వేలకు మించి తరలిస్తే స్వాధీనం చేసుకోనున్నారు. వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నిరంతరం చెక్ పోస్టుల తనిఖీలను పర్యవేక్షిస్తున్నారు.

చెక్ పోస్టుల వివరాలు

- వరంగల్ జిల్లా పరిధిలో నర్సంపేట నియోజకవర్గంలో అయ్యప్ప గుడి నర్సంపేట, బోలోన్‌పల్లి (నల్లబెల్లి), అశోక్‌నగర్ (ఖానాపురం)
- తూర్పు నియోజకవర్గంలో ఎంజీఎం సర్కిల్, నాయుడు పెట్రోల్‌పంపు, జాన్‌పాక్ లేబర్‌కాలనీ.
- వర్ధన్నపేట నియోజకవర్గ పరిధిలో అనంతసాగర్ (హసన్‌పర్తి), డీసీ తండా, చింత నెక్కొండ.
- వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో కాజీపేట డీజిల్ కాలనీ, ఐశ్వర్య గార్డెన్ (ములుగు రోడ్), సీఎస్ఆర్ గార్డెన్ (హంటర్‌రోడ్డు).
- పరకాల నియోజకవర్గంలో కటాక్షపూర్ క్రాస్‌రోడ్డు, కొమ్మాల, నడికూడ.
- హుస్నాబాద్ నియోజకవర్గం పెంచికలపేట (ఎల్కతుర్తి).
- జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ పరిధిలో జీడికల్ (లింగాలఘణపురం), నల్లబండ (జఫర్‌గఢ్), రాంపూర్ (ధర్మసాగర్).
- పాలకుర్తి నియోజకవర్గం మొండ్రాయి (దేవరుప్పుల), కిష్టాపూర్ క్రాస్‌రోడ్డు (రాయపర్తి).
- జనగామ నియోజకవర్గం పెంబర్తి (జనగామ), ఇన్యానాయక్ తండా (తరిగొప్పుల), కొన్నె క్రాస్‌రోడ్ (బచ్చన్నపేట).

మతాన్ని ప్రోత్సహించే ఎన్ఈపీ విద్యా విధానాన్ని రద్దు చేయాలి

ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి

కేయూ క్యాంపస్, మార్చి 20: మతాన్ని ప్రోత్సహిస్తూ, మనుషుల్లో తారతమ్యాలను తేచ్చే నూతన జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎల్ మూర్తి డిమాండ్ చేశారు. బుధవారం కేయూ దూరవిద్యకేంద్రంలోని ప్రొఫెసర్ జాఫర్ నిజాం సెమినార్ హాల్‌లో ఎస్ఎఫ్ఐ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆర్ఎల్ మూర్తి హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెచ్చిన అన్‌సైంటిఫిక్ ఎన్ఈపీ-2020ని రద్దు చేయాలని అన్నారు. విద్యాసంస్థల్లో మతాన్ని ప్రవేశపెట్టే విధానాలను కేంద్రం మానుకోవాలని డిమాండ్ చేశారు. బడా పెట్టుబడిదారులకు కంపెనీ జీతగాళ్లుగా తయారు చేసే విధానాన్ని రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ పోరాడుతోందని అన్నారు. వర్సిటీల స్వయంపతిపత్తిని కాపాడాలని అన్నారు.

ఎస్ఎఫ్ఐ కేయూ కమిటీ ఎన్నిక

కాకతీయ యూనివర్సిటీ ఎస్ఎఫ్ఐ నూతన కమిటీని 17 మందితో నియమించగా అధ్యక్ష, కార్యదర్శులుగా సాయికిరణ్, స్టాలిన్‌లు ఎంపికయ్యారు. అలాగే ఉపాధ్యక్షులుగా పరిమిళ, అరుణ్, సహాయకార్యదర్శిగా అనూష, జస్వంత్, ట్రెజరర్‌గా అభిరామ్, కమిటీ సభ్యులుగా వరుణ్‌తేజ్, సాయి ప్రసన్న, సందీప్, తేజస్విని, సాయితేజ, పవన్‌లను ఎన్నుకున్నారు. అనంతరం మహాసభ నూతనంగా ఎన్నికైన కమిటీ పలు తీర్మానాలను ఆమోదించింది. వర్సిటీల స్వయం పతిపత్తిని కాపాడాలని, కేయూ అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని, వర్సిటీల్లో ఖాళీగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించాలని తీర్మానాల్లో కోరారు. ఎస్ఎఫ్‌సీ కోర్సులను రెగ్యులర్ చేయాలని, సరైన అర్హతలున్న వారినే వీసీలుగా నియమించాలని, రాజకీయ ప్రాబల్యం వద్దని కోరారు. పెంచిన వర్సిటీల్లోని ఫీజులను తగ్గించాలని, కేయూ మహిళ ఇంజనీరింగ్ విద్యార్థులకు వసతి సౌకర్యం కల్పించాలని కోరారు. నూతన కమిటీకి ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి మంద శ్రీకాంత్, వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ, కేయూ అధ్యక్షుడు డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్ అభినందించారు. వివిధ డిపార్టుమెంట్‌ల విద్యార్థులు పాల్గొన్నారు.



ఎస్ఎఫ్ఐ సమావేశంలో మాట్లాడుతున్న ఆర్ఎల్ మూర్తి

నగరంలో హంగులతో కూడిన క్రికెట్ స్టేడియం

హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు

వరంగల్ స్పోర్ట్స్, మార్చి 20: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) ఆధ్వర్యంలో వరంగల్ నగరంలో ఉప్పల్ స్టేడియం తరహాలో అన్ని హంగులతో కూడిన రంజీ మ్యాచ్‌లు ఆడే వసతుల కలిగిన నూతన క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానని హెచ్‌సీఏ, హ్యాండ్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.జగన్‌మోహన్‌రావు తెలిపారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఓ హోటల్‌లో వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి జగన్‌మోహన్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు.

అనంతరం జగన్‌మోహన్‌రావు మాట్లాడుతూ.. హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ అంటే ఒక్క హైదరాబాద్ ప్రాంతానికే పరిమితం కాదని, రాష్ట్రంలో ఉన్న 10 జిల్లాల సొత్తు అని పేర్కొన్నారు. హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతీ జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. క్రికెట్‌ను మారుమూల ప్రాంతాలకు విస్తరించేలా హెచ్‌సీఏ ఆధ్వర్యంలో ప్రతిభ గల క్రీడాకారులకు సహాయ సహకారాలు అందజేస్తామన్నారు. త్వరలోనే వరంగల్ నగరంలో క్రికెట్ వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తామని, ఇందులో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను హెచ్‌సీఏ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో శిక్షణ ఇస్తామన్నారు. వరంగల్‌లో క్రికెట్ క్లబ్ ఏర్పాటుకు జిల్లాలోని వివిధ క్రీడాసంఘాల బాధ్యులు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. హనుమకొండ జేఎన్ఎస్‌లో ఉన్న హ్యాండ్‌బాల్ అకాడమీని ఎట్టి పరిస్థితుల్లో తరలించకూడదని కోరారు. అనంతరం జిల్లా నూతన కార్యవర్గన్ని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఈసమావేశంలో ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అజీజ్‌ఖాన్, బైరబోయిన కైలాస్ యాదవ్, తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, వరంగల్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి చాగంటి శ్రీనివాస్, అంతర్జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పోగుల అశోక్, అథ్లెటిక్స్ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణి, ఫైన్ విద్యాసంస్థల చైర్మన్ మూగల కుమార్‌యాదవ్, కబడ్డీ అసోసియేషన్ బాధ్యులు సారంగపాణితో పాటు వివిధ క్రీడా సంఘాల బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



వరంగల్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గంతో జగన్‌మోహన్‌రావు

హ్యాండ్‌బాల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

ఉమ్మడి వరంగల్ జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ చైర్మన్‌గా బొద్దిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, అధ్యక్షుడిగా డాక్టర్ ఇండ్ల నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు విష్ణు, కోశాధికారిగా బి. నరేందర్‌బాబు, ఉపాధ్యక్షులుగా పోగుల అశోక్, ఎస్. రాజ్‌కుమార్, సంయుక్త కార్యదర్శి బి. అశోక్, ఈసీ సభ్యులుగా సంతోష్, శ్రీధర్, వీరస్వామి, శ్రీను, కిరణ్, నాగరాజులను ఏకగ్రీవంగా నియమితులయ్యారు.



రామలింగేశ్వరస్వామి దేవాలయ కమిటీ ఎన్నిక

సంగెం, మార్చి 20: మండలంలోని కుంట గ్రామంలో బుధవారం శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షురాలిగా కందకట్ల కళావతి నరహరి, చైర్మన్‌గా ఇందూరి శివారెడ్డి, ఉపాధ్యక్షులుగా చిర్ర ఆనంద్, ఇనుముల రాజు, కాగిత జగన్నాథచారి, జున్న రమేష్, పులిపాటి మధు, కపిల కుమారస్వామి, పొలపైన పైడి, పెనుగుల లింగమూర్తి, ప్రధాన కార్యదర్శిగా జున్న దేవేందర్, సంయుక్త కార్యదర్శులుగా బోల్ల మల్లేష్, ఎనుబోతుల అనిల్, జున్న యాకయ్య, కాగితాల శేఖర్, పెంతల నగేష్, రైతు రమేష్, పుల్ల సతీష్ ఎన్నికయ్యారు. అదేవిధంగా కోశాధికారులుగా ఏలుకుర్తి రవికుమార్, జక్క వేణు, జున్న శ్రీను, కురుతురి సురేందర్, చిర్ర సునీల్, కార్యవర్గ సభ్యులుగా బోల్ల శ్రావణ్, జక్క అశోక్(పెద్ద), ఆకుల శ్రావణ్, దండు శ్రీధర్, రైతు నగేష్, జక్క శ్రీనివాస్, కడమంచి రవి, రోహిత్, గోపతి, కొన్నె రవీందర్‌లను ఎన్నుకున్నారు.

కుష్టువ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత

రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ మైకేల్



కుష్టువ్యాధి నిర్మూలన సర్వేను పరిశీలిస్తున్న డాక్టర్ మైకేల్

పోచమ్మమైదాన్, మార్చి 20: కుష్టువ్యాధి నిర్మూలన సామాజిక బాధ్యత అని ఆరోగ్య శాఖ రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ మైకేల్ అన్నారు. వరంగల్ దేశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని లెనిన్ నగర్‌లో బుధవారం జాతీయ కుష్టువ్యాధి నిర్మూలన సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ మైకేల్ మాట్లాడుతూ శరీరంపై తెల్లని, ఎర్రని, రాగి రంగు కలిగిన మచ్చలు స్పర్శ లేకుండా మొద్దుబారి ఉండటం కుష్టువ్యాధిగా పరిగణించాలని సూచించారు. కుష్టువ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి ఎండీటీ చికిత్స ద్వారా వ్యాధిని, దాని వల్ల కలిగే అంగవైకల్యాలను నివారించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫిజియోథెరపిస్టు డాక్టర్ నర్సింహారెడ్డి, డీపీఎంవో అనుపమ, ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు జన్ను కోర్నెలు, ఆశా కార్యకర్తలు ప్రమీల, శ్రీవాణి, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రైఫిల్ షూటింగ్‌కు గుడిబడి విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను, ఎన్‌సీసీ అధికారి ప్రవీణ్‌ను అభినందించిన హెచ్ఎం వెంకటేశ్వర్‌రావు

వరంగల్ సిటీ, మార్చి 20: ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడలో ఏప్రిల్ 29 నుంచి జరిగే ఇంటర్ డైరెక్టరేట్ షూటింగ్ చాంపియన్ కాంపిటీషన్స్(ఐడీఎస్‌సీసీ) జాతీయ స్థాయి ఎన్‌సీసీ షూటింగ్ శిబిరానికి వరంగల్‌లోని నరేంద్రనగర్(గుడిబడి) ప్రభుత్వ పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. వరంగల్‌లోని 10 టి బెటాలియన్‌కు చెందిన ఆర్మీ వింగ్ కమాండర్ ఎ.ఎస్.ఖండూరీ నేతృత్వంలో గత సోమవారం అమ్మవారిపేట ఫైరింగ్ ఏరియాలో విద్యార్థుల ఎంపిక నిర్వహించారు. నరేంద్రనగర్ పాఠశాలలో తొమ్మిదవ తరగతికి చెందిన డి.శివ, సీహెచ్.అభినవ్, కె.లిప్సిక ఎంపికయ్యారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని బుధవారం గుడిబడిలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వెంకటేశ్వర్లు ఎంపికైన విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ అధికారి జోగు ప్రవీణ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారస్వామి, అజయ్‌బాబు, శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

రెడ్ ఫోర్ట్ పరేడ్‌లో పాల్గొన్న క్యాడెట్‌కు సన్మానం



ఎన్‌సీసీ క్యాడెట్ హర్షితను సన్మానిస్తున్న తాళ్లపెల్లి అర్జున్

మిల్స్‌కాలనీ, మార్చి 20: ఢిల్లీలో ఇటీవల ప్రధాని నరేంద్ర మోదీ సమక్షంలో రెడ్ ఫోర్ట్‌లో నిర్వహించిన నేషనల్ పరేడ్‌లో పాల్గొన్న వరంగల్ రంగశాయిపేటకు చెందిన గాదె హర్షితను 42వ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు తాళ్లపెల్లి అర్జున్ సన్మానించారు. బుధవారం ఆమె నివాసంలో హర్షితను సన్మానించారు. ఎన్‌సీసీ క్యాడెట్ గా గుర్తింపబడి జాతీయ స్థాయిలో ప్రధాని ముందు నిర్వహించిన పరేడ్‌లో పాల్గొనడం హర్షనీయమని అర్జున్ కొనియాడారు.

రేషన్ బియ్యం.. పోషకాల సమాహారం

- అధికారులు చెబుతున్నా పట్టించుకోని జనం
- అపోహలు వీడాలంటున్న అధికారులు



రేషన్ దుకాణంలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారు

వరంగల్ కలెక్టరేట్, మార్చి 20: రేషన్ బియ్యం ఆరోగ్యాన్ని ఇస్తాయని పౌర సరఫరాల శాఖ అధికారులు చెబుతున్నా లబ్ధిదారులు మాత్రం అవేమి పట్టించుకోకుండా విక్రయాలకే మొగ్గు చూపుతున్నారు. రేషన్ బియ్యంలో అనేక పోషకాలు ఉంటాయని జాతీయ పోషకాహార సంస్థ సైతం ఈ విషయాన్ని చెబుతోంది. సరైన అవగాహన లేకపోవడంతో కొందరు లబ్ధిదారులు ఫోర్టిఫైడ్ రేషన్ బియ్యాన్ని తినడానికి ఇష్టపడటం లేదు. రూ.10 చొప్పున కిలో బియ్యాన్ని చాలా మంది అమ్ముకోవడం జరుగుతోంది. పౌర సరఫరాల శాఖ గత సంవత్సరం ఏప్రిల్ మాసం నుంచి ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది.

అపోహలు వీడాలంటున్న అధికారులు

చిన్నారులు, యుక్త వయస్కులు, గర్భిణుల్లో రక్తహీనత ఉన్నట్లు జాతీయ కుటుంబ సర్వే నివేదిక స్పష్టం చేసింది. రక్తహీనత సమస్యను అధిగమించడం పెద్ద సమస్యేమి కాదని శాస్త్రవేత్తలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. మహిళలు ఐరన్ 13 మిల్లీ గ్రాములు, గర్భిణులు 1.323, పాలిచ్చే తల్లులు 14.35, పురుషులు 15.19 తీసుకునే మొత్తం ఆహారంలో గ్రహిస్తున్నట్లు చెబుతున్నారు.

పోషకాల మమేకంతో ఆరోగ్యం

ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌ని బియ్యపు పిండి, విటమిన్ ఖనిజాల మిశ్రమంతో తయారు చేస్తారు. ఫోర్టిఫైడ్ రైస్‌లో ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12తోపాటు ఇతర అనేక పోషకాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఒక క్వింటాల్ సాధారణ బియ్యంలో కిలో ఫోర్టిఫైడ్ రైస్ కెర్నల్స్‌ను మిళితం చేస్తారు. వీటిని మిల్లుల్లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బ్లెడింగ్ యూనిట్ల ద్వారా కలిపి ఫోర్టిఫైడ్ రైస్‌ను ప్రభుత్వం ఆధీనంలోని నిల్వ కేంద్రాలకు సరఫరా చేస్తారు. ఫోర్టిఫైడ్ బియ్యంలో సూక్ష్మ పోషకాలైన ఐరన్, ఫోలిక్ యాసిడ్, విటమిన్ బి-12లు నిర్ణీత మోతాదులో ఉంటాయి. ఇవి రక్తహీనత నుంచి కాపాడటమే కాకుండా శరీరంలోని అలసటను తగ్గించి చురుకుదనాన్ని పెంచుతాయి. నెలలు నిండకుండా ప్రసవం జరగడం, శిశువు బరువు తక్కువగా పుట్టడం వంటి ప్రసవ సంబంధిత సమస్యలు తలెత్తకుండా చేస్తాయి. పుట్టుకతో వచ్చే రుగ్మతల నుంచి రక్షణ కల్పిస్తుం ది. మెదడు, నాడీ వ్యవస్థ పనితీరు మెరుగుపర్చి శరీరంలో రక్తం తయారయ్యేందుకు సహకరిస్తుంది.

అవగాహన కల్పిస్తే మేలు

రేషన్ బియ్యం ఆరోగ్యాన్ని ఇస్తాయని పౌర సరఫరాల శాఖ అధికారులు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. ఇందులో అనేక పోషకాలు మిళితం చేయడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయనే విషయం చాలా మంది లబ్ధిదారులకు తెలియదు. సన్నరకం బియ్యానికి అలవాటు పడిన ప్రజలు వాటినే ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రతి నెల రేషన్ బియ్యం తీసుకుంటున్న వారిలో సగం మంది విక్రయించడం జరుగుతుంది. రేషన్ బియ్యాన్ని ఆహారంగా తీసుకోవడం ద్వారా కలిగే లాభాలను పౌర సరఫరాల శాఖ అధికారులతోపాటు రేషన్ డీలర్లు లబ్ధిదారులకు తెలియజేస్తేనే ప్రయోజనం చేకూరుతుంది.

బియ్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి



సూక్ష్మ పోషకాల లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఫోర్టిఫైడ్ బియ్యాన్ని పంపిణీ చేస్తోంది. తెల్ల రేషన్‌కార్డు ఉన్న ప్రతి లబ్ధిదారునికి అందజేస్తాం. బియ్యాన్ని కడిగేటప్పుడు పోషకాల బియ్యం నీటిపై తేలియాడుతుంటాయి. ప్లాస్టిక్ బియ్యం అనుకొని వాటిని తీసిపడేయవద్దు. అంగన్‌వాడీ సెంటర్లకు, మధ్యాహ్నభోజన పథకం కింద పాఠశాలలకు పోషకాల బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. రేషన్‌కార్డు లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలి.

- శివప్రసాద్‌రెడ్డి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, వరంగల్

కలెక్టరేట్‌లో మీడియా సెంటర్ ప్రారంభం



మీడియా సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వరంగల్ కలెక్టరేట్, మార్చి 20 : కలెక్టరేట్‌లోని డీపీఆర్‌వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సెంటర్, మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ సెల్(ఎంసీఎంసీ)ను జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించిన సమగ్ర సమాచారం ఎప్పటికప్పుడు మీడియా సెంటర్ ద్వారా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అందించాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో ఎంసీఎంసీ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ, ముందస్తు అనుమతి లేకుండా ప్రకటనలు ప్రసారం చేయడం, అభ్యర్థుల ప్రచార వ్యయం లెక్కించడం జరుగుతుందని తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ పార్టీల ప్రకటనలకు సకాలంలో ఆమోదం మంజూరు చేయాలని అన్నారు. వార్తా పత్రికలు, ఇ-పేపర్లు, టెలివిజన్ చానల్స్, స్థానిక కేబుల్ నెట్‌వర్క్స్, సోషల్ మీడియా, మూవీ హౌస్‌లు, ఎస్ఎంఎస్‌లు, ఇతర విజువల్ మీడియాలతో సహా ప్రకటనలను ఎంసీఎంసీ నుంచి ముందస్తు అనుమతి పొందిన తర్వాతే ప్రచారం చేయాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో డీపీఆర్‌వో అయూబ్ అలీ, అదనపు పీఆర్‌వో ప్రేమలత, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, రమేశ్, ఎంసీఎంసీ సభ్యులు శ్రీధర్, మెండు రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల గ్రీవెన్స్ సెల్ పరిశీలన

ఎన్నికల నిబంధనల ప్రకారం సీజ్ చేసిన వాటిని ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టం పోర్టల్‌లో విధిగా నమోదు చేయాలని జిల్లా రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. హనుమకొండ కుడా కార్యాలయాల సముదాయ భవనంలోని జిల్లా సహకార అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎన్నికల గ్రీవెన్స్ సెల్‌ను బుధవారం కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్ రూమ్, రికార్డుల నిర్వహణ తీరును పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వేలెన్స్ బృందాల పర్యవేక్షణలో స్వాధీనం చేసుకున్న డబ్బు, మద్యం, బంగారం తదితర వివరాలను పోర్టల్‌లో సకాలంలో నమోదు చేయాలని తెలిపారు. నిబద్ధతతో పనిచేస్తూ ప్రతిరోజు గ్రీవెన్స్‌లో స్వీకరించిన వాటిని నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో రాంరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, డీటీవో విజయసారథి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ సుమలత, సీనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, జూనియర్ అసిస్టెంట్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నగరంలోని ఆలయాల్లో ఏకాదశి పూజలు

వరంగల్ కల్చరల్, మార్చి 20: ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం నగరంలోని వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు కొనసాగాయి. కలశ పూజలు నిర్వహించిన అనంతరం శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శ్రీవిష్ణు సహస్ర నామ పారాయణం నిర్వహించారు. జేపీఎన్ రోడ్డులోని గీతా భవన్‌లోని శ్రీవేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, ఎల్లంబజార్‌లోని శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయంలో, కాశిబుగ్గ రంగనాథ స్వామి దేవాలయంలో, ములుగు రోడ్‌లోని దత్తక్షేత్రంలో ఏకాదశి సందర్భంగా అభిషేకాలు, అర్చనలు కొనసాగాయి. బట్టల బజార్‌లో గల శ్రీబాలానగర శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఏకాదశి పూజలు చేశారు. అభిషేకం అనంతరం అలంకరణ, బంగారు పుష్పాలతో స్వామి వారికి అర్చన నిర్వహించారు. అర్చన అనంతరం నైవేద్య నివేదన, మహా మంగళ హారతి గావించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులందరికి తీర్థప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

నేడు నరసింహుడి కల్యాణోత్సవం

చురుకుగా కొమ్మాల జాతర పనులు



ఉత్సవమూర్తులకు వేద పారాయణం నిర్వహిస్తున్న అర్చకులు

గీసుగొండ, మార్చి 20: మండలంలోని కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా నేడు (గురువారం) రాత్రి స్వామి వారి కల్యాణోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చక్రవర్తుల శ్రీనివాసాచార్యులు తెలిపారు. కల్యాణోత్సవానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరై స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలను సమర్పిస్తారని చెప్పారు. కాగా, బుధవారం స్వామి వారికి అంకురారోపణం, రక్షాబంధనం, దీక్షావస్త్రాధారణ, అగ్నిప్రతిష్ఠను నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు కాండూరి రామాచార్యులు, అడిగొప్పుల విష్ణు, తూపురాణి ఫణీంద్ర, ఈవో గుళ్లపెల్లి శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

కొమ్మాల శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర నిర్వహణ పనులు చురుకుగా సాగుతున్నాయి. కొద్ది నెలల క్రితం కొమ్మాల ఆలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి ఆలయ అభివృద్ధికి కోసం రూ.60 లక్షలను మంజూరు చేయించారు. ఈ నిధులతో సామూహిక మరుగుదొడ్లను ఏర్పాటు చేస్తున్నారు. అదేవిధంగా ఆలయ ఆర్చిగేటు నుంచి ఆలయం వరకు రూ.10 లక్షలతో ఫార్మేషన్ రోడ్డు విస్తరణ పనులు, ఆలయం నుంచి నాచినపెల్లి వైపు రూ.10 లక్షలతో కి.మీ మేర ఫార్మేషన్ రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. ఈనెల 25న హోలి రోజు జాతర(ప్రభబండ్లు తిరుగుట) అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నట్లు జాతర ఉత్సవ కమిటీ తెలిపింది.

గూడ్స్ కిందపడి వృద్ధుడి ఆత్మహత్య



మృతి చెందిన గుర్తుతెలియని వృద్ధుడు

గిర్మాజిపేట, మార్చి 20: వరంగల్‌లోని రైల్వేగూడ్స్ షెడ్డులోకి వెళ్తున్న గూడ్స్ కిందపడి గుర్తు తెలియని వృద్ధుడు(56) ఆత్మహత్య చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ జి.నరేష్ తెలిపారు. బుధవారం ఉదయం 10.30 గంటల ప్రాంతంలో లోడ్‌తో ఉన్న గూడ్స్ రైలు షెడ్డులోకి వెళ్తుండగా పట్టాల పక్క నుంచి గుర్తు తెలియని వృద్ధుడు పరుగెత్తుకుంటూ వచ్చి గూడ్స్ కింద పడటంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందినట్లు చెప్పారు. ఆయన పిస్తా రంగు ఫుల్‌షర్టు, వైట్ కలర్ బనియన్, బ్రౌన్ కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడని సీఐ పేర్కొన్నారు.

మృతుడి కుడిచేతిపై శివలింగం, ఓంకారం, నాగుపాము పచ్చబొట్లు, ఎడమ చేతిపై గట్టయ్య, గట్టమ్మ, బుచ్చయ్య, బుచ్చమ్మ పేర్లతో పచ్చబొట్లు ఉన్నాయన్నారు. ఆయన వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని చెప్పారు. వృద్ధుడు అనారోగ్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్నట్లుగా అనుమానిస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతదేహాన్ని ఎంజీఎం ఆస్పత్రి మార్చురిలో భద్రపరిచి గూడ్స్ పైలట్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడి బంధువులు, కుటుంబసభ్యులు 9441557232 /8712658585 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

బీఎల్ఎఫ్ అభ్యర్థులను గెలిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రమేశ్

గిర్మాజిపేట, మార్చి 20: లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల పక్షాన పోరాడి ప్రశ్నించే ఎంసీపీఐ(యు), బీఎల్ఎఫ్ బలపరిచే అభ్యర్థులను గెలిపించాలని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేశ్ పిలుపునిచ్చారు. వరంగల్ అండర్ బ్రిడ్జి సమీపంలోని ఓంకార్ భవన్‌లో బుధవారం నాయకుడు రవి అధ్యక్షతన జరిగిన ఎంసీపీఐ(యు) వరంగల్ నగర శాఖ సమావేశంలో రమేష్ మాట్లాడారు. ఎన్నికల హామీలను విస్మరిస్తున్న పాలక పార్టీలను ఎన్నికల్లో ఓడించాలని అన్నారు. చారిత్రాత్మక వరంగల్ నగరం అభివృద్ధి 'ఎక్కడ వేసిన గొంగలి అక్కడే' అన్న చందంగా ఉందని, దీనికి కారణం పాలక పార్టీలేనని రమేష్ ఆరోపించారు.

సమావేశంలో ఎంసీపీఐ(యు) వరంగల్ నగర కార్యదర్శి జగదీశ్వర్, నాయకులు నర్ర ప్రతాప్, మాలి ప్రభాకర్, నగేష్, ఐలయ్య, నరసయ్య, రాజు, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు శిక్ష

ఖానాపురం, మార్చి 20 : మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించినట్లు ఎస్సై రఘుపతి బుధవారం తెలిపారు. ఈ నెల 15న మద్యంసేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ పోచయ్యను నర్సంపేట కోర్టులో హాజరుపరచగా ద్వితీయశ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు రెండురోజుల జైలు శిక్షతోపాటు రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్సై తెలిపారు. నింధితుడిని మహబూబాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే, వారిని అరెస్ట్‌చేసి కోర్టులో రిమాండ్ చేస్తామని తెలిపారు.

● ఇద్దరికి జైలు..

నెక్కొండ : డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేందర్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండలంలోని మోడల్ పాఠశాల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, బోనాల సంతోష్‌కుమార్, నగెల్లి అరుణ్‌కుమార్ మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా వారి పరిశీలించగా అధిక మోతాదులో మద్యం సేవించినట్లు గుర్తించారు. వారిని నర్సంపేట మేజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ముందు హాజరు పరచగా, రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ 500ల జరిమానాను విధించారు. వారితో పాటు దారవత్ లింగయ్య, పేరమల్ల ఉపేందర్, సుంకరి సత్యనారయణ, ఈసాలపాటి శివకుమార్, ఈ.మహేష్‌లకు నర్సంపేట మేజిస్ట్రేట్ జరిమానాను విధించారని ఎస్సై తెలిపారు.

గీత కార్మికుడి మృతి

చెన్నారావుపేట, మార్చి 20 : తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని జోజేర్వు గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన గీత కార్మికుడు దీకొండ నాగేశ్వర్‌రావు (నగేష్) (44) రోజువారి మాదిరిగా తాటి చెట్టు ఎక్కి కల్లు తీసి కిందకు దిగుతున్న క్రమంలో మోకు జారటంతో ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చుట్టుపక్కల వారు గమనించి ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతునికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, బాధిత కుటుంబాన్ని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ పరామర్శించి ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, మద్దెల సాం బయ్య, పురుషోత్తంగౌడ్ ఉన్నారు.

1, 2 తేదీల్లో ఆర్థిక వ్యవహారాలు బంద్

గిర్మాజిపేట, మార్చి 20: ఆర్థిక సంవత్సరం ఆర్థిక సంవత్సరం 2023-2024 ముగింపు సందర్భంగా ఏప్రిల్ 1, 2 తేదీల్లో వరంగల్ తపాలా డివిజన్ పరిధిలోని అన్ని పోస్టాఫీసుల్లో ఆర్థిక వ్యవహారాలు జరుగవని వరంగల్ తపాలా డివిజనల్ సూపరింటెండెంట్ ఎస్‌వీఎల్ఎన్ రావు బుధవారం తెలిపారు. పోస్టల్ బ్యాంకింగ్, సేవింగ్ అకౌంట్ తదితర పనులు రెండు రోజుల పాటు నిలిపివేయబడుతాయని చెప్పారు. తపాలా వినియోగదారులు ఇందుకు సహకరించాలని ఆయన కోరారు.

ఎంఈయూ జిల్లా అధ్యక్షుడిగా సాంబయ్య



గీసుగొండ, మార్చి 20: మాదిగ హక్కుల దండోర(ఎంహెచ్‌డీ) అనుబంధ సంస్థ అయిన మాదిగ ఎంప్లాయీస్ యూనియన్(ఎంఈయూ) వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా గనిపాక సాంబయ్యను నియమించినట్లు ఎంహెచ్‌డీ జిల్లా అధ్యక్షుడు ప్రదీప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు బుధవారం సాంబయ్యకు నియామక పత్రాన్ని అందించినట్లు చెప్పారు. కాగా, మాదిగల హక్కులు, ఆత్మ గౌరవాన్ని కాపాడేందుకు తనవంతు కృషి చేస్తానని సాంబయ్య తెలిపారు.

పౌర్ణమి రోజున గ్రహణం లేదు..

వరంగల్ కల్చరల్, మార్చి 20: ఈనెల 25 పౌర్ణమి రోజున ఎలాంటి గ్రహణం లేదని, ప్రజలు అపోహలు పెట్టుకోవద్దని ప్రముఖ జ్యోతిష్య పండితులు, అర్చకులు సముద్రాల సుదర్శనాచార్యులు బుధవారం తెలిపారు. హోలీ పండుగ సందర్భంగా సోమవారం పౌర్ణమి రోజున గ్రహణం ఉందని ప్రచారం జరగడంతో ప్రజలు గందరగోళానికి గురవుతున్నారని చెప్పారు. ఆ రోజున ఎలాంటి గ్రహణం లేదని, పౌర్ణమి హోమాలు, పూజలు, వ్రతాలు యథావిధిగా నిర్వహించుకోవచ్చని సుదర్శనాచార్యులు తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అధికారులు

సంగెం, మార్చి 20 : మండలంలోని చింతలపల్లి, కుంటపల్లి గ్రామాలను తహసీల్దార్ రాజ్‌కుమార్ బుధవారం సందర్శించారు. ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించేందుకు సహకరించాలని ప్రజలను కోరారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించాలని ఉద్యోగులను తహసీల్దార్ ఆదేశించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మిత్రుల సాయం



మృతుడి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

సంగెం, మార్చి 20: మండలంలోని పల్లారుగూడలో బీఆర్ఎస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు పోడేటి ప్రశాంత్ తండ్రి, ఆర్ఎంపీ పోడేటి సంపత్ అనారోగ్యంతో ఇటీవల మరణించారు. గ్రామంలోని ప్రశాంత్ ఇంటికి బుధవారం వెళ్లిన మిత్రులు సంపత్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ సందర్భంగా రూ.10వేలు ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పురుషోత్తంరెడ్డి, చంద్రశేఖర్, రాజు, అనిల్, సుమన్, రంజిత్, శ్రావణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే అరూరికి సత్కారం

మిల్స్‌కాలనీ, మార్చి 20: ఇటీవల బీజేపీలో చేరిన వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే అరూరి రమేష్‌ను బీజేపీ నాయకుడు కర్ర రవీందర్ సత్కరించారు. బుధవారం ఓసిటీలోని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నివాసంలో అరూరిని శాలువా కప్పి పుష్పగుచ్ఛంతో సత్కరించారు. కార్యక్రమంలో ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు

సంగెం, మార్చి 20: మండలంలోని నర్సానగర్ గ్రామంలో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. పశువైద్యాధికారి రాజు పశువులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో గోపాల మిత్రలు కమలాకర్, బాబు, జితేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL గురువారం 21 మార్చి 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి

చెక్‌పోస్టు తనిఖీ

వర్ధన్నపేటరూరల్, మార్చి 20 : వర్ధన్నపేట శివారులోని డీసీ తండా వద్ద ఉన్న చెక్‌పోస్టును బుధవారం అదనపు కలెక్టర్ శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీచేశారు. వరంగల్ ఖమ్మం జాతీయ రహదారి పలు వాహనాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎస్ఎస్‌టీ చెక్ పోస్టు టీం సభ్యులు ఎప్పటికప్పుడు వాహనాలను తనిఖీ చేయాలని సూచించారు. అనుమానాస్ప దంగా ఎవరు కనిపించినా వెంటనే ఉన్నతాధికారులకు సమా చారం



రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్

ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్ధన్నపేట తహసీ ల్దార్ విజయ్ సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

నోడల్ ఆఫీసర్, మామునూరు ఏసీపీ తిరుపతి

వర్ధన్నపేట రూరల్, మార్చి 20 : పార్లమెంటు ఎన్నికల సందర్భంగా పోలీసులు, రెవెన్యూ అధికారులతో పాటు ఇతర శాఖ వారు సమన్వయంతో పనిచేయాలని వర్ధన్నపేట నియోజకవర్గ నోడల్ ఆఫీసర్, మామూనూరు ఏసీపీ తిరుపతి, వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్‌సాగర్ సూచిం చారు.బుధవారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో ఎంపీ ఎన్నికలు సజావుగా సాగేలా కృషి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని, తాగునీరు, విద్యుత్ సరఫరా, వికలాంగులకు ర్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. సరిహద్దు ప్రాంతాల్లో పటిష్ట నిఘా, ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. అంతకు ముందు పట్టణంలో పలు పోలింగ్ స్టేషన్లను పరిశీలించారు. ఈ సమావేశంలో వర్ధన్నపేట సీఐ సూర్యప్రకాష్, ఎస్ఐ ప్రవీణ్ కుమార్, పర్వతగిరి, హన్మకొండ, ఐనవోలు, హసన్‌పర్తి,కాజీపేట, ఖిలావరంగల్, మండలాల తహసీల్దార్లు, సీఐలు, ఎస్ఐలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో పాల్గొన్న పోలీసులు, రెవెన్యూ అధికారులు

పశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలి

వర్ధన్నపేట రూరల్, మార్చి 20 : గ్రామీణ ప్రాంతాల రైతులు, పశువుల కాపరులు పశువుల ఆరోగ్యంపై దృష్టి సారించాలని సంచార వైద్యశాల ప్రాజెక్టు సమన్వయ కర్త డాక్టర్ భగీష్ మిశ్రా సూచించారు. బుధవారం పట్టణంలోని పశు సంచార వాహనాలను తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూగజీవాల వైద్య సేవల్లో వెటర్నరీ అధికారులు నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల పట్ల రైతులకు అవగాహన కల్పిస్తూ చికిత్స అందించాలని సూచించారు. ఎల్లప్పుడు రైతులకు అందుబాటులో ఉంటూ, పశువులకు చికిత్స అందేలా చూడాలన్నారు. అధికారుల సూచనలు పాటించినప్పుడే రైతులు పశువులను కాపాడుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్, సిబ్బంది రాము పాల్గొన్నారు.

మునిసిపాలిటీ నుంచి తండాలను తొలగించాలి

వర్ధన్నపేట రూరల్, మార్చి 20 : వర్ధన్నపేట మునిసిపాలిటీ నుంచి తండాలను ప్రభుత్వం వెంటనే తొలంగించాలని గిరిజనులు డిమాండ్ చేశారు. బుధవారం పట్టణ శివారులో డీసీ తండా వద్ద వరంగల్ ఖమ్మం జాతీయరహదారిపై ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అంగోతు తారాబాయి, చిలుకమ్మ, నరేష్, పాండ్యా, గణేష్‌లు మాట్లాడుతూ కొందరి రాజకీయ స్వలాభం కోసం తండాలను కలిపి వర్ధన్నపేట మునిసిపాలిటీగా ఏర్పాటుచేశారని ఆరోపించారు. మునిసిపాలిటీ ఏర్పాటుతో ఎన్నో ఇబ్బందులు పడు తున్నామని, ఉపాధిహామీ పథకం లేకపోవడంతో గిరిజనులకు ఉపాధి కూలీలేకుండా పోయిందన్నారు. ఇండ్లు కట్టుకోవాలంటే అనేక పేచీలు పెడుతూ అధికారులు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. తండాల్లో మౌలిక వస తులులేక గిరిజ నులు ఇబ్బందులు పడుతున్నారని, తమకు ప్రత్యేక గ్రామపంచాయతీ ఏర్పాటు చేయాలన్నారు. డీసీ తండాతో మరికొన్ని తండాలు మునిసిపాలిటీ నుంచి తొలగించి తమకు విముక్తి కలిగించాలని కోరారు. సమస్యను పరిష్కరించకుంటే పార్లమెంటు ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో భూక్యా సోని, మాలోతు సుశీల, అంగోతు బుజ్జి, హరియా తదితరులు పాల్గొన్నారు.



డీసీ తండాలో ఆందోళన చేస్తున్న గిరిజనులు

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

'పేట' డివిజన్‌లో ఐదేళ్ల క్రితం సీసీ కెమెరాల ఏర్పాటు

ఖర్చు భయంతో నిర్వహణలో చేతులెత్తేసిన పోలీసులు

నర్సంపేట టౌన్, మార్చి 20 : ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, తమ కళ్ల ముందు చీమ చిటుక్కుమన్న పసిగట్టే శక్తి వాటి సొంతం.. వాటి కంటి చూపులోంచి ఏ ఒక్క నేరస్తుడు తప్పించుకోలేడు.. పోలీసులు పెట్రోలింగ్ చేయకపోయినా సీసీ కెమెరాలు నిరంతరం నిఘా పెడతాయి. అంతటి పనితనం కలిగినప్పటికీ వాటి నిర్వహణపై పోలీసులు శ్రద్ధ చూపించకపోవడం, అధికారుల పట్టింపులేనితనంతో నిఘా నేత్రాలు నిద్రావస్థలోకి వెళ్లి పనిచేయని పరిస్థితి నర్సంపేట డివిజన్‌లో నెలకొంది. డివిజన్‌లో నర్సంపేట, నల్లబెల్లి, దుగ్గొండి, నెక్కొండ, చెన్నారావుపేట, ఖానాపురం పోలీస్‌స్టేషన్‌లు ఉన్నాయి. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు నిర్వహణలోపంతో అనేక చోట్ల పనిచేయడం లేదు. డివిజన్ కేంద్రమైన నర్సంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో నర్సంపేట పట్టణంతో పాటు 27 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. పోలీస్‌స్టేషన్ పరిధిలో గత కొన్ని రోజులుగా తాళాలు వేసి ఉన్న ఇళ్లల్లో దొంగతనాలు జరుగుతున్నాయి. ఇళ్ల ముందు, దుకాణ సముదాయాల ముందు పార్క్ చేసిన బైక్‌లను ఎత్తుకెళ్తున్న సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. చోరీ సంఘటనలకు పాల్పడిన దొంగలను పట్టుకోవడానికి ఉపయోగపడే సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో దొంగలను పట్టుకోవడం పోలీసులకు సవాల్‌గా మారింది.

నిర్వహణను పట్టించుకునే వారేరీ?

నర్సంపేట పట్టణంతో పాటు మండలంలోని వివిధ గ్రామాల్లో ఐదేళ్ల క్రితం వ్యాపారులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ సహకారంతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అందులో నర్సంపేట పట్టణంలో 60 కెమెరాలు, గ్రామాల్లో 150 కెమెరాలను ప్రధాన సెంటర్లు, కాలనీల్లో ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల ఏర్పాటైన కొత్తలో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గింది. నేరం జరిగిన ఒకటి, రెండు రోజుల్లోనే సీసీ కెమెరాల సహాయంతో నేరస్తులను పట్టుకోవడంతో నేరం చేయాలంటేనే జంకే పరిస్థితులు ఉన్నాయి. సంవత్సరాలు గడుస్తున్న కొద్దీ సీసీ కెమెరాల నిర్వహణ ఖర్చు పోలీసులకు భారంగా మారింది. గత రెండేళ్లుగా ఖర్చు భయంతో పోలీసులు చేతులెత్తేశారు. దీంతో సీసీ కెమెరాల వైర్లు తెగిపోయి, వాలిడిటీ ముగిసిపోవడంతో ఒకటి, రెండు చోట్ల మినహా ఎక్కడా సీసీ కెమెరాలు పని చేయక మూలనపడ్డాయి.

ఆందోళనలో ప్రజలు

ప్రతీ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఏడాదిలో ఎక్కువగా దొంగతనాలు వేసవిలోనే జరగడం తెలిసిందే. చోరీలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వల్ల నేరాలు తగ్గుముఖం పట్టాయనడంలో సందేహంలేదు. కానీ, ఐదేళ్ల క్రితం ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు మూలన పడడం, వేసవి కాలం రావడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పట్టణంలోని వివిధ కాలనీల్లో, గ్రామాల్లో సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో ఇటీవల కాలంలో చోరీలు పెరిగిపోయాయి. ప్రస్తుత వేసవిలో చోరీలు జరిగే అవకాశం ఉన్నందున పోలీసులు సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



నర్సంపేట బస్టాండ్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు

అందరి భాగస్వామ్యంతోనే నిఘా పటిష్టం

ప్రభుత్వంతో పాటు ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ వ్యాపారవర్గాల భాగస్వామ్యంతోనే సీసీ కెమెరాల నిర్వహణ సక్రమంగా జరుగుతుందని పోలీసులు వాదన. ప్రతీ మూడు నెలలకొకసారి సీసీ కెమెరాల కమ్యూనిటీ ప్రోగ్రాంలను నిర్వహించినప్పటికి ప్రజలు తమ తమ కాలనీల్లో, ఇళ్ల ముందు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి ముందుకు రావడంలేదని పోలీసులు చెబుతున్నారు. ఏది ఏమైనా సీసీ కెమెరాల పనితీరును మెరుగుపర్చడంతో పాటు పూర్తిగా పనిచేయని వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటుచేసి నేరాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. సీసీ కెమెరాలను పటిష్టవంతం చేయడంలో పాలకులు, వ్యాపార వర్గాలు, ప్రజల భాగస్వామ్యం ఎంతైనా ఉంది.

ఎమ్మెల్యే గారు.. క్యాడర్‌ను కాపాడండి

పట్టణ కాంగ్రెస్‌లో గందరగోళం

రెండు వర్గాలుగా కాంగ్రెస్ నాయకులు

ఆరోపణలపై చర్చకు సిద్ధం..!

వర్ధన్నపేట రూరల్, మార్చి 20 : వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు కాంగ్రెస్ పార్టీ క్యాడర్‌ను కాపాడండి దండం పెడతామంటూ పట్టణ కాంగ్రెస్ నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని ఎంఎంఆర్ గార్డెన్‌లో విలేఖరుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మహ్మద్ అఫ్సర్, కొండేటి బాలకృష్ణలు మాట్లాడుతూ పార్టీ కష్టకాలంలో ఉన్న సమయంలో పది సంవత్సరాల పాటు జెండా మోసి ఎన్నో అవమానాలకు గురయ్యామని గుర్తుచేశారు. అప్పటి అధికార పార్టీ ఎన్ని ఇబ్బందులు పెట్టిన తట్టుకుని ముందుకు సాగి, ఎమ్మెల్యేగా కేఆర్ నాగరాజును గెలిపించుకున్నామని తెలిపారు. కానీ, కొంతమంది కుటిల రాజకీయాలు చేస్తూ కల్లబొల్లి మాటలు చెపుతున్నారని, వారిని నమ్మొద్దని కోరారు. పాత, కొత్త అనే తేడాలు లేకుండా అందరినీ కలుపుకుని పనిచేసేందుకు సిద్ధంగా ఉన్నామని, కానీ, కనీస గౌరవంగా నాయకుల అభిప్రాయాలు తీసుకోకపోవడం బాధగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యేను దూషించామని కొందరు నాయకులు అనడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్‌లో కొందరు సీనియర్ నాయకులు అమ్ముడు పోయారని, ఎమ్మెల్యే ఓటమికి కృషి చేశారని అనడం సరికాదన్నారు. పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడ్డారని తెలిపిన నాయకులు చర్చకు రావాలని, మండల, జిల్లా స్థాయిలో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడాలని డిమాండ్ చేశారు. ఇతర పార్టీలకు సహకరించినట్లు నిరూపిస్తే దేనికైనా సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఎమ్మెల్యేపై గౌరవం ఉందని, నాయకులు, కార్యకర్తల మనోభావాలను అర్థం చేసుకుని ఎమ్మెల్యే మాట్లాడాలని కోరారు. సమావేశంలో చిదురాల కుమారస్వామి, ఎస్‌కే.మంజూర్, షబ్బీర్, ప్రేమ్ రాజ్, సదానందం, ఎల్లగౌడ్, రాంబాబు, మల్లయ్య జగన్, వెంకటనర్సు, ఎల్లస్వామి, లచ్చిరాం, వెంకన్న, సోహైల్, యాకయ్య, సుధాకర్, రాజు పాల్గొన్నారు.



వర్ధన్నపేటలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

• వర్గాలుగా చీలిక...

నూతన పట్టణ అధ్యక్షుడి నియామకంతో వర్ధన్నపేట పట్టణంలో కాంగ్రెస్ పార్టీ రెండు వర్గాలుగా చీలిపోయాయి. ఒకరి తర్వాత ఒకరు వారి వారి వర్గాలతో మీడియా సమావేశాలు పెట్టి, ఆరోపణలు, ప్రతి ఆరోపణలు చేసుకుంటున్నారు. వాస్తవానికి గత దశాబ్దాల కాలంగా పార్టీని నమ్ముకున్న ఉన్న కాంగ్రెస్ నాయకులకు నూతన అధ్యక్షుడి నియామకం మింగుడు పడడంలేదు. అయినప్పటికీ ఎమ్మెల్యే నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, గౌరవంగా పట్టణ కాంగ్రెస్ సమావేశం పెట్టి నిర్ణయం తీసుకుంటే బాగుండని ఆవేదన వెల్లబుచ్చుతున్నారు. ఇటీవల ఇతర పార్టీల నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్న వారికి మాత్రమే ప్రాధాన్యత ఇవ్వడంపై అసహనంగా ఉన్నారు. ఇదంతా కావాలని క్యాడర్‌ను కన్ఫ్యూజ్ చేయడానికి చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. స్వార్థపూరిత రాజకీయాలకు వర్ధన్నపేటను బలి చేయవద్దని ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు చొరవ తీసుకుని కూర్చుని మాట్లాడితే సమస్య సద్దుమణుగుతుందని చెప్పుకుంటున్నారు. రాబోయే ఎంపీ, మునిసిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన వారిని గెలిపించుకోవాలంటే ఐకమత్యమే ముఖ్యమని చెపుతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే నాగరాజు పట్టణ కాంగ్రెస్ రగడకు ఫులిస్టాప్ పెట్టాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుకుంటున్నారు.

వంద శాతం పన్నులు వసూలు చేయాలి



వర్ధన్నపేటలో పన్నులు వసూలు చేస్తున్న కమిషనర్ జోనా

వర్ధన్నపేట రూరల్, మార్చి 20 : మునిసిపాలిటీ పరిధిలో నల్లా, ఇంటి పన్నులను వంద శాతం వసూలు చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని పట్టణ కమిషర్ ఇజోనా స్పష్టం చేశారు. బుధవారం పట్టణంలోని పలు వార్డుల్లో పన్నుల వసూళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 31 నాటికి పూర్తిస్థాయిలో పన్నులు వసూలు చేయాలన్నారు. సిబ్బందికి ప్రతీ రోజు రూ. 50 వేల టార్గెట్‌ను పెట్టి గత 3 నెలలుగా ఉదయం నుంచి రాత్రి వరకు తిరిగేవిధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఇంటి పన్నుల డిమాండ్ రూ.56 లక్షలు ఉండగా, ఇప్పటికే 80 శాతం రూ. 45 లక్షల వరకు వసూలు చేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపాలిటీ సిబ్బంది పాల్గొన్నారు.

• వసూళ్లు సరే... సమస్యల పరిష్కారమేది?

మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ఇంటి, నల్లా పన్నులను వసూలు చేసేందుకు అధికారులు అహర్నిశలు కృషి చేయడాన్ని ప్రజలు కితాబిస్తున్నారు. కానీ, వసూళ్ల మాట అటుంచితే వార్డుల్లో ఉన్న సమస్యల పరిష్కారానికి మునిసిపల్ అధికారులు ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నిస్తున్నారు. ఆయా వార్డుల్లో డ్రైనేజీ సమస్య, వీధి లైట్ల సమస్య, ఎక్కడ పడితే అక్కడ చెత్తాచెదారం ఉన్నప్పటికీ ఎందుకు పట్టించుకోవడం లేదంటున్నారు. రూ.లక్షల్లో వస్తున్న ఆదాయాన్ని, వసూలు చేస్తున్న తీరును చెపుతున్నారని, సమస్యల పరిష్కారంపై మాత్రం అధికారులు దృష్టి సారించడం లేదని ఆరోపిస్తున్నారు. వర్ధన్నపేట పట్టణ అభివృద్ధి, సమస్యల పరిష్కారంపై వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్‌నాగరాజు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. పాలన పూర్తిగా కుంటుపడిందని, పట్టణ ప్రగతిపై సమీక్ష సమావేశం నిర్వహించి స్పెషల్ డ్రైవ్ చేసేలా చూడాలంటున్నారు. ముఖ్యంగా పారిశుధ్యంపై దృష్టి సారించాలని డిమాండ్ చేస్తున్నారు.

స్వయం పరిపాలన దినోత్సవం

చెన్నారావుపేట, మార్చి 20: మండలంలోని పాత ముగ్దుంపురం గ్రామంలోని జాగృతి విద్యానికేతన్‌లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలను బోధించారు. కరస్పాండెంట్‌గా పిట్టల అనన్యశ్రీ, హెచ్ఎంగా హంస అక్షయ, డీఈవో ప్రశాంత్, ఎంఈవోగా సాయిజ్యోతిలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ ఈగ సత్యానారాయణ, గోదాదేవి. శిరీష, గీత, కవిత, సరస్వతి పాల్గొన్నారు.

సహకార సంఘ రైతులకు రుణాలందించాలి

చెన్నారావుపేట, మార్చి 20 : సహకార సంఘంలో సభ్యత్వం ఉన్న రైతులందరికీ రుణాలను అందించాలని సొసైటీ మాజీ వైస్ చైర్మన్ తొగరు చెన్నారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీఈవో రవికి వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకార సంఘంలో రూ.8కోట్లు నిల్వ ఉన్నప్పటికీ రైతులకు అందించడం లేదన్నారు. కొత్తగా సభ్యులకు రుణాలు అందించటంలో పాలక వర్గం విఫలం చెందిందన్నారు. గోదాంల నిర్మాణానికి, భూమి కొనుగోలుకు ఎలాంటి అనుమతులు లేవని ఆరోపించారు. సభ్యుడి అర్హతకు తగిన విధంగా రుణాలను అందించాలన్నారు. లేని పక్షంలో ఆదివారం సహకార సంఘం కార్యాలయం ముందు నిరవధిక దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేశెట్టి రాజు, ఇరుకుల శ్రీను, జక్క వెంకటేశ్వర్లు, భూక్య భద్రు, చిలుకూరి నగేష్, శ్రీను పాల్గొన్నారు.



సీఈవో రవికి వినతి పత్రాన్ని అందిస్తున్న నాయకులు

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా వినయ్



నల్లబెల్లి, మార్చి 20 : బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంటా రవికుమార్ ఆదేశాల మేరకు మండల బీజేపీ అధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి సమక్షంలో మండల నూతన కార్యవర్గాన్ని బుధవారం ప్రకటించారు. అనంతరం మండల ప్రధాన కార్యదర్శులుగా తడుక వినయ్, బచ్చు వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షుడిగా ఒల్లే రమేష్, మండల యువ మోర్చా అధ్యక్షుడిగా సుధగాని ప్రమోద్, మండల దళిత మోర్చా అధ్యక్షుడిగా కామోర పాపయ్య, మండల గిరిజన మోర్చా అధ్యక్షుడిగా మాలోతు అనిల్, మండల కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా పోలేటి శ్రీనివాస్‌రెడ్డిలను నియమించినట్లు మండల కేంద్రంలో బీజేపీ మండలాధ్యక్షుడు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి తెలిపారు.

మెపా రాష్ట్ర కార్యదర్శిగా చిరంజీవి నియామకం



దుగ్గొండి, మార్చి 20: మండలంలోని తిమ్మంపేట గ్రామానికి చెందిన దండు చిరంజీవిని మెపా(ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) రాష్ట్ర కార్యదర్శిగా నియామించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్, ప్రధాన కార్యదర్శి బొట్లపల్లి సంజీవన్ కుమార్‌లు గౌరవ అధ్యక్షుడు డాక్టర్ జగన్ మోహన్‌లు బుధవారం వెల్లడించారు. మండలంలోని గిర్నిబావిలో వారు మాట్లాడుతూ ముదిరాజ్ కులస్థుల అభివృద్ధికి మెపా కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన చిరంజీవి మాట్లాడుతూ జాతి అభివృద్ధికోసం అందరిని కలుపుకొని పోయి ఐక్యంగా ఉండి రిజర్వేషన్‌లకై ఉద్యమిస్తానన్నారు.

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం

దుగ్గొండి, మార్చి 20 : మండలంలోని మందపల్లి గ్రామానికి చెందిన బాగాయితి ఐలయ్య మృతి చెందగా, అతని కుమారుడు రాంబాబుతో 1994-95లో నాచినపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న స్నేహితులు బుధవారం రూ:17,700లు ఆర్థిక సాయం చేశారు. అంబరకొండ గోవర్ధన్, అంద్రు మహేందర్, బొమ్మినేని జితేందర్, బండి పూర్ణచందర్, బైరెడ్డి కర్ణాకర్, నరహరి అనిత, కవిత, లావుడియా రాజు, పెద్ద రాజు, ఒరంగంటి కిరణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, బొల్ల రవి, తౌరు మంజుల, కాసిడి రమణారెడ్డి, మొతె కరుణ, బొమ్మినేని మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ గట్టికల్లు గ్రామ అధ్యక్షుడిగా సతీష్

రాయపర్తి, మార్చి 20 : మండలంలోని గట్టికల్లు గ్రామానికి చెందిన మెరుగు సతీష్‌గౌడ్‌ను కాంగ్రెస్ గ్రామ పార్టీ నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా నియమించినట్లు మండల పార్టీ అధ్యక్షుడు ఈదుల కంటి రవీందర్‌రెడ్డి తెలిపారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని‌రెడ్డి, ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిల ఆదేశాల మేరకు బుధవారం గ్రామ పార్టీ నాయకులతో కలిసి ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఖానాపురం, మార్చి 20 : మద్యం సేవించి వాహనం నడిపిన ఓ వ్యక్తికి జైలు శిక్షతో పాటు జరిమానా విధించి నట్లు ఎస్సై రఘుపతి బుధవారం తెలిపారు. ఈ నెల 15న మద్యంసేవించి వాహనం నడుపుతూ పట్టుబడిన ఆదిలాబాద్ జిల్లా కాగజ్‌నగర్‌కు చెందిన లారీ డ్రైవర్ పోచయ్యను నర్సంపేట కోర్టులో హాజరుపరచగా ద్వితీయ శ్రేణి న్యాయమూర్తి వెంకటేశ్వర్లు రెండు రోజుల జైలు శిక్షతోపాటు రూ.1,500 జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్సై తెలిపారు. నింధితుడిని మహబూబాబాద్ సబ్ జైలుకు తరలించినట్లు తెలిపారు. మద్యం సేవించి వాహనం నడిపితే, వారిని అరెస్ట్‌చేసి కోర్టులో రిమాండ్ చేస్తామని తెలిపారు.

• మరో ఇద్దరికి...

నెక్కొండ : డ్రంకన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష విధించినట్లు ఎస్సై మహేందర్ బుధవారం తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం... మండలంలోని మోడల్ పాఠశాల సమీపంలో వాహనాలను తనిఖీ చేస్తుండగా, బోనాల సంతోష్ కుమార్, నగెల్లి అరుణ్‌కుమార్ మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా వారి పరిశీలించగా అధిక మోతాదులో మద్యం సేవించినట్లు గుర్తించారు. వారిని నర్సంపేట మేజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు ముందు హాజరు పరచగా, రెండు రోజుల జైలు శిక్షతో పాటు రూ 500ల జరిమానాను విధించారు. వారితో పాటు దారవత్ లింగయ్య, పేరమల్ల ఉపేందర్, సుంకారి సత్యనారయణ, ఈసాలపాటి శివకుమార్, ఈ.మహేష్‌లకు నర్సంపేట మేజిస్ట్రేట్ జరిమానాను విధించారని ఎస్సై తెలిపారు.

గీత కార్మికుడి మృతి



నగేష్ (ఫైల్)

చెన్నారావుపేట, మార్చి 20 : తాటి చెట్టు పైనుంచి ప్రమాదవశాత్తు పడి గీత కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని జోజేర్వు గ్రామంలో మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... ఇదే గ్రామానికి చెందిన గీత కార్మికుడు దీకొండ నాగేశ్వర్‌రావు (నగేష్) (44) రోజువారి మాదిరిగా తాటిచెట్లు ఎక్కడానికి తాటి వనానికి వెళ్లాడు. తాటి చెట్టు ఎక్కి కల్లు తీసి కిందకు దిగుతున్న క్రమంలో మోకు జారటంతో ప్రమాదవశాత్తు కింద పడిపోయాడు. దీంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. చుట్టు పక్కల వారు గమనించి ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మృతి చెందాడు. మృతునికి భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా, బాధిత కుటుంబాన్ని గౌడ జన హక్కుల పోరాట సమితి మోకు దెబ్బ స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్ అనంతుల రమేష్ పరామర్శించారు. ప్రభుత్వం బాధిత కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియాను అందించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జిల్లా అధ్యక్షుడు గోపగాని వెంకట్‌గౌడ్, మద్దెల సాంబయ్య, పురుషోత్తంగౌడ్, కత్తి స్వామిగౌడ్, బండి రమేష్, బుర్ర సుదర్శన్‌గౌడ్, నరేందర్‌గౌడ్ ఉన్నారు.

అంగన్‌వాడీ సెంటర్లలో పోషణ పక్వాడ్ ఉత్సవాలు

చెన్నారావుపేట, మార్చి 20 : మండలంలోని కందిగడ్డ తండా, ఎల్లాయిగూడెం, తిమ్మారాయిన్‌పహాడ్, అంగన్‌వాడీ సెంటర్‌లో పోషణ పక్వాడ్ ఉత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్ వైజర్ కోడి మంజుల మాట్లాడుతూ పిల్లలు ఆరోగ్యంగా ఉండా లంటే పోషక ఆహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్లల్లో అన్నప్రసన్న, అక్షరాభ్యాసం కార్యక్రమాలను చేపట్టారు. అనంతరం పిల్లలతో, తల్లులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆకుకూరలు. కూరగాయల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్‌లు. ఆశకార్యకర్తలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

లక్ష్మీనర్సింహస్వామి జాతరను విజయవంతం చేయాలి

చెన్నారావుపేట, మార్చి 20 : మండలంలోని కోనాపురం గుట్టపై వెలిసిన లక్ష్మినర్సింహస్వామి జాతరను విజయవంతం చేయాలని ఆలయ ప్రధాన అర్చకుడు శివకృష్ణాచార్యులు బుధవారం తెలిపారు. ప్రతీ సంవత్సరం హోలి పండుగ ముందు స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ నెల 21న కల్యాణోత్సవం, 25న జాతర మహోత్సవం, 29న స్వామి వారి రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

'ధరణి'ని యథాతథంగా కొనసాగించాలి



డీటీకి వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు

నల్లబెల్లి, మార్చి 20 : మండల తహసీల్దార్ కార్యాలయంలోని ధరణి వెబ్‌సైట్ యథాతథంగా కొనసాగించాలని జిల్లా దళిత విద్యావంతుల వేదిక కార్యదర్శి భట్టు సాంబయ్య సమక్షంలో డీటీ మధుసూదన్‌కి బుధవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా భట్టు సాంబయ్య మాట్లాడుతూ.. రైతుల సమస్యలను తీర్చే ధరణి వెబ్‌సైట్ తహసీల్దార్ కార్యాలయంలో గత రెండు రోజుల నుంచి పనిచేయకపోవడంతో రైతుల క్రయవిక్రయాలు ఆగిపోయాయన్నారు. ఎంపీ ఎన్నికల కోడ్ దృష్ట్యా ధరణి వెబ్‌సైట్‌ను జూన్ నెల వరకు ఆపడం సరైంది కాదన్నారు. రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ స్పందించి ధరణి వెబ్‌సైట్ యథాతథంగా కొనసాగే విధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగెల్లి సురేష్, రాము, రాజేందర్‌లు పాల్గొన్నారు.

సమసమాజం కోసం గురువయ్య పని చేశారు..

దుగ్గొండి, మార్చి 20 : ప్రజలు సుఖసంతోషాలతో జీవించే సమసమాజం కోసం జీవితాంతం పోరాడిన బీరం గురువయ్య చిరకాలం ప్రజల్లో ఉండిపోతారని సీపీఎం ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి వాసుదేవా రెడ్డి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఈసంపెల్లి బాబులు అన్నారు. మండలంలోని తిమ్మంపేటలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సీపీఎం సీనియర్ నాయకుడు సొసైటీ మాజీ అధ్యక్షుడు బీరం గురువయ్య సంస్మరణ సభ బుధవారం నిర్వహించగా వారు పాల్గొని మాట్లాడారు. సంస్మరణ సభలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కోరబోయిన కుమారస్వామి, బూక్య సమ్మయ్య, జిల్లా కమిటీ సభ్యుడు నమిండ్ల స్వామి, కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, ఎంపీటీసీ మాలోతు చంద్రు, కడియాల మనోహర్ తదితరులు పాల్గొన్నారు.